http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

గురువారం 7 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



### నూతన ప్రభుత్వ ఏర్పాటుకు

## మార్గం సుగుమం

- సీఎం పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా
- సీఎం పదవికి రాజీనామా చేసిన అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ
- గవర్నర్‌కు సమర్పించిన రాజీనామా లేఖ

### మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే

# ఆమోదించండి



- హైదరాబాద్ మెట్రో రెండో దశకు అనుమతులు ఇవ్వండి
- కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి
- మెట్రోను రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్నట్లు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన సీఎం

హైదరాబాద్

హైదరాబాద్ మెట్రో రెండో దశకు త్వరగా ఆమోదం తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో అరగంట పాటు భేటీ అయ్యారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు–ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్–3 కింద చేపట్టాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2కు ఆమోదం తెలపాలని కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖ మంత్రి మనోహర్ లాల్ - మిగతా3లో



## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజు నియంత్రణకు అథారిటీ ఏర్పాటు చేయాలి

- కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని ప్రభుత్వం నియంత్రించాలన్న టీఆర్‌ఎస్ అధ్యక్షురాలు
- ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీకి ఇప్పుడే పరిష్కారించాలని డిమాండ్
- ఫీజుల నియంత్రణ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన కవిత

హైదరాబాద్

విద్య ద్వారానే సమానత్వం, స్వేచ్ఛ సాధ్యమని టీఆర్?ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత అన్నారు. నాణ్యమైన విద్య – ఫీజుల నియంత్రణ అనే అంశంపై ఆమె హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉచిత విద్య, వైద్యం భాద్యత ప్రభుత్వాలదే అనే నమ్మకం ప్రజల్లో ఉండాలన్నారు. ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ స్కూళ్లు - మిగతా3లో



### పంజాబ్‌లో

## హైఅలర్ట్

- రెండు గంటల్లో 2చోట్ల పేలుళ్లు.. రంగంలోకి ఎన్ఐఏ
- పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపైనా దర్యాప్తు
- ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించిన జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు

## భారత్- వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం

- 25బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం
- భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశం
- యుపిఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం
- రెండు దేశాల మధ్య విమాన అనుసంధానం నిరంతరం పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది.



### కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమగ్రంగా పూర్తి వివరాలు

# సమర్పించండి

- భూసేకరణ, జరిగిన పని, చేయాల్సిన పని ఇలా అన్ని వివరాలుండాలని ఆదేశించిన సీఎం
- 21, 22 ప్యాకేజీల పనుల గురించి ఇటీవల ముఖ్యమంత్రి సమీక్ష
- తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు



హైదరాబాద్

అక్కడో పని ఇక్కడో పని చేపట్టడం కాకుండా కాళేశ్వరం ప్రాజెక్టులో చేపట్టిన అన్ని ప్యాకేజీల వివరాలను సమగ్రంగా తయారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదనపు టీఎంసీ పనులతో సహా అన్నింటిలోనూ భూసేకరణ, జరిగిన పని, చేయాల్సిన పని ఇలా అన్ని వివరాలు ఉండాలని సూచించారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా శ్రీరామ్? సాగర్ ప్రాజెక్ట్? నుంచి ఉమ్మడి నిజామాబాద్‌కు నీటిని మళ్లించే 21, 22 ప్యాకేజీల పనుల గురించి ఇటీవల సీఎం సమీక్షించారు. మాసాని, మంచిప్ప చెరువుల సామర్థ్యం పెంచడానికి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు, మళ్లీ రద్దు చేయడం, కొత్తగా ఐదు టీఎంసీలతో చెరువుల కెపాసిటీని పెంచి నీటిని సప్లై చేయడం తదితర ప్రతిపాదనలపై - మిగతా3లో



## ఆసక్తికరంగా తమిళ రాజకీయాలు

- గవర్నర్‌ను కలిసిన విజయ్
- మద్దతు ఇవ్వమంటున్న లెఫ్ట్ పార్టీలు
- లోక్‌భవన్‌కు చేరుకున్న టీవీకే అధినేత విజయ్
- గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిసిన విజయ్
- ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరిన విజయ్

### రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువ పెంపునకు

# రంగం సిద్ధం!

- ఆ ప్రాంతాల్లో స్థిరాస్తుల ధరలు పెరిగే ఛాన్స్
- మార్కెట్ విలువను అనుసరించి భూముల ధరలు సవరించనున్న ప్రభుత్వం
- 15–20 శాతం మార్కెట్ విలువ పెంచే దిశగా కసరత్తు
- పలు ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగే అవకాశం



హైదరాబాద్

తెలంగాణలో స్థిరాస్తుల మార్కెట్ విలువల పెంపునకు రంగం సిద్ధమైంది. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలకు, బహిరంగ మార్కెట్ విలువలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు రిజిస్ట్రేషన్ విలువలను పెంచాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టూ ఉన్న ఓఆర్‌ఆర్(ఔటర్ రింగు రోడ్డు) పరిధిలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు ప్రభుత్వం మూడోసారి కసరత్తు ప్రారంభించనుంది. గతంలో రెండు సార్లు కసరత్తు పూర్తి చేసినప్పటికీ, అమలు దశలోనే ఆగిపోయింది.ఇప్పుడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 20 రోజుల్లో కొత్త మార్కెట్ విలువలు అమలు చేస్తామని ప్రకటించడంతో రియల్ ఎస్టేట్ రంగంలో తిరిగి చర్చలు - మిగతా3లో

## లోక్‌సభలో ప్రతి 6వ బీజేపీ ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే గెలిచారు

- నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే లోక్‌సభలో బీజేపీ 140 స్థానాలు కూడా గెలుచుకోలేదని రాహుల్ గాంధీ జోస్యం
- ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమ జేబులో పెట్టుకున్న సంస్థలు 'రిమోట్ కంట్రోల్'తో నడుస్తున్నాయి



# భారత్- వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం



ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోదీ ప్రసంగించారు.

భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. పహల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండగా నిలిచినందుకు వియత్నాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ వెల్లడించారు. ఇందులో భాగంగా యూపీఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు.

"2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లేందుకు అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. మన ఔషధ అధికార వర్గాల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం వియత్నాంలో భారతీయ ఔషధాల లభ్యతను పెంచుతుంది. వియత్నాంకు భారతీయ వ్యవసాయ, మత్స్య, పశు ఉత్పత్తుల ఎగుమతి కూడా సులభతరం కాబోతోంది. "త్వరలోనే భారతదేశపు ద్రాక్ష, దానిమ్మ పండ్లను వియత్నాం రుచి చూస్తుంది, అలాగే మనం వియత్నాం పోమెలో పండ్లను రుచి చూస్తాము. అంతేకాకుండా, ఈ ఏడాది చివరి నాటికి భారత్-ఆసియాన్ వాణిజ్య ఒప్పందాన్ని ఆధునీకరించడానిక అంగీకరించాం. ఇది భారతదేశానికి, అన్ని ఆసియాన్ దేశాలకు మధ్య వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త ఊపునిస్తుంది. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, ఇంధన సహకారంలో కొత్త కార్యక్రమాలు మన రెండు దేశాల ఆర్థిక భద్రతను, సరఫరా గొలుసు మెరుగుపరుస్తాయి. అనుసంధానం, సామర్థ్య నిర్మాణం మన భాగస్వామ్యానికి ముఖ్యమైన స్తంభాలు. రెండు దేశాల మధ్య విమాన అనుసంధానం నిరంతరం పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది."

దక్షిణ చైనా సముద్రంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకుంటున్న విషయం కూడా ఇరుపక్షాల మధ్య జరిగిన ప్రతినిధి బృందం స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కలిసి వచ్చిన వియత్నాం అధ్యక్షుడు లామ్, మూడు రోజుల భారత్?లో పర్యటించనున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన దేశంలో చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇది. అంతకుముందు మంగళవారం రాష్ట్రపతి భవన్?లో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరియు ప్రధానమంత్రి మోదీ ఆయనకు స్వాగతం పలికారు. దిల్లీకి వచ్చేముందు బిహార్?లోని బోధ్ గయాలోనూ పర్యటించి మహాబోధి ఆలయంలో ప్రార్థనలు చేశారు.

# ఆసక్తికరంగా తమిళ రాజకీయాలు



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్‌తో సమావేశమైంది. ఈ మేరకు టీవీకే అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ గవర్నర్‌ను కోరారు. అందుకు గవర్నర్ సమ్మతించారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. గురువారమే విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. 5 వేల మంది అతిరథ మహారథులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి 108 సీట్లు రాగా ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 సీట్లు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో తమిళ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి షరతులతో కూడిన మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఇందుకు సంబంధించి తమిళనాడు కాంగ్రెస్ ఇంఛార్జ్ గిరీశ్ చోడంకర్ సంతకం చేసిన ఓ లేఖను అధికారికంగా విడుదల చేసింది. లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు ఇవ్వాలని తమిళనాడు కాంగ్రెస్ నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు మంగళవారం రాత్రి తమిళనాడు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ-గాజా అత్యవసరంగా సమావేశమై నిర్ణయం తీసుకుంది. బీజేపీ, దాని మిత్ర పక్షాలు ఎట్టి పరిస్థితుల్లో తమిళనాడులో అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని కాంగ్రెస్ చెప్పింది. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి విజయ్‌తో సమావేశమయ్యారు. వాళ్లందరినీ విజయ్ శాలువాలతో సత్కరించారు. ఐదుగురు సభ్యులు ఉన్న కాంగ్రెస్ మద్దతు ఇచ్చినప్పటికీ టీవీకేకు మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే కూడా విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైంది. పీఎంకేకు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

**ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీని ఆహ్వానించిన విజయ్**

అటు విజయ్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రానున్నారు. ప్రమాణస్వీకారానికి రాహుల్ గాంధీని విజయ్ ఆహ్వానించినట్లు కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. రాహుల్, ఖర్గేతో విజయ్ ఫోన్‌లో మాట్లాడి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించినట్లు చెప్పారు.

**విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చేది లేదన్న లెఫ్ట్ పార్టీలు**

ఇదిలా ఉండగా, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మద్దతు కోరుతూ ౹ఎఖ వివిధ రాజకీయ పార్టీలను సంప్రదిస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. డీఎంకే మిత్రపక్షమైన ఎజఖ దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ౹ఎఖ ఆహ్వానించినప్పటికీ, వామపక్ష పార్టీలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ మాత్రం విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన జూ×(వీ) అభ్యర్థులు ఆర్. చెల్లస్వామి, లతతో పాటు సీపీఐ సభ్యులు టి. రామచంద్రన్, మారిముత్తు డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌ను కలిశారు. అటు ×ఖమీ తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికైన సయ్యద్ ఫరూక్ బాషా (గూడీ), ఏ.ఎం. షాజహాన్ కూడా డీఎంకే అధ్యక్షుడిని కలిశారు. అనంతరం మాట్లాడుతూ తాము డీఎంకేకి తమ మద్దతును కొనసాగిస్తామని సీపీఐ(ఎం), సీపీఐ, ×ఖమీ శాసనసభ్యులు స్పష్టం చేశారు.

**పళనిస్వామితో టీవీకే నేత సమావేశం**

ఇదిలా ఉండగా, టీవీకే ప్రధాన కార్యదర్శి చీ ఆనంద్ అన్నాడీఎంకే అధినేత ఎడప్పడి పళనిస్వామితో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇతర టీవీకే నాయకులు కూడా పళనిస్వామితో చర్చించినట్లు తెలిసింది. ఒక వేళ టీవీకే, 47 సీట్లు ఉన్న అన్నా డీఎంకే జతకడితే ప్రభుత్వ ఏర్పాటు మెజార్టీకి ఎలాంటి ఢోకా ఉండదు.

# లోక్‌సభలో ప్రతి 6వ బీజేపీ ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే గెలిచారు



లోక్‌సభలో ప్రతి 6వ బీజేపీ ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే గెలిచారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ పరిభాషలో వారిని 'చొరబాటుదారులు' అని పిలవాలా అని ప్రశ్నించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే లోక్‌సభలో బీజేపీ 140 స్థానాలు కూడా గెలుచుకోలేదని రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. ఓట్ల చోరీతో కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లు, మరికొన్నిసార్లు ప్రభుత్వమే అపహరణకు గురవుతుందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. లోక్‌సభలోని 240 మంది బీజేపీ ఎంపీల్లో దాదాపు ప్రతి 6వ ఎంపీ ఓట్ల చోరీతోనే గెలిచారని చెప్పారు. హరియాణాలో మొత్తం ప్రభుత్వమే చొరబాటుకు గురైందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమ జేబులో పెట్టుకున్న సంస్థలు 'రిమోట్ కంట్రోల్'తో నడుస్తున్నాయని ఎన్నికల సంఘంపై పరోక్షంగా విమర్శలు చేశారు. బీజేపీ నేతలు వాస్తవం అంటే భయపడుతున్నారని దుయ్యబట్టారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ఈరోజు 140 స్థానాలు కూడా వారు గెలుచుకోలేరని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

"ఓట్ల చోరీతో కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లు, మరికొన్నిసార్లు ప్రభుత్వమే అపహరణకు గురవుతాయి. లోక్‌సభలోని 240 మంది బీజేపీ ఎంపీల్లో, సుమారు ప్రతి ఆరో ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే తన సీటును దక్కించుకున్నారు. వారిని గుర్తించడం కష్టం కాదు. బీజేపీ సొంత పరిభాషలోనే చెప్పాలంటే మనం వారిని 'చొరబాటుదారులు' అని ముద్ర వేయాలా? ఇక హరియాణా సంగతేంటి? అక్కడ ఏకంగా ప్రభుత్వమే ఒక 'చొరబాటుదారు'గా ఉంది. వారు తమ జేబుల్లో పెట్టుకుని తిరిగే సంస్థలే ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించి దుర్వినియోగం చేస్తున్నాయి. అవన్నీ స్వయంగా 'రిమోట్ కంట్రోల్' ద్వారా నడుస్తున్నాయి. వారికి నిజంగా భయం కలిగించేది సత్యమే. ఎందుకంటే, ఒకవేళ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే, ఈ రోజు వారు కనీసం 140 సీట్లు కూడా గెలవలేరు." ఇదిలా ఉండగా బంగాల్‌లో ౹వీజ ఓటమిపై కొందరు సంబరపడిపోతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అలా సంతోషం వ్యక్తం చేస్తున్న వారిలో కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలు సైతం ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వారంతా ఒక్కటి గుర్తుంచుకోవాలని రాహుల్ సూచించారు. ఇది కేవలం ఒక పార్టీ ఓటమి లేదా గెలుపునకు సంబంధించిన విషయం కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ మాధ్యమంలో రాహుల్ గాంధీ ఓ పోస్ట్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఏకం కావాలని రాహుల్ పిలుపునిచ్చారు. అసోం, బంగాల్‌లో తీర్పును దొంగిలించడం అనేది, భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనే లక్ష్యంలో భాగంగా బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగని రాహుల్ ఆరోపించారు "కాంగ్రెస్‌లోని కొందరు, అలాగే ఇతరులు, ౹వీజ ఓటమిని చూసి సంబరపడుతున్నారు. వారు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అసోం, బంగాల్ ప్రజల తీర్పును అపహరించడం అనేది, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే లక్ష్యంలో దీజీఞ వేసిన ఒక పెద్ద ముందడుగు. చిల్లర రాజకీయాలను పక్కన పెట్టండి. ఇది ఏదో ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది భారతదేశానికి సంబంధించిన విషయం."అని రాహుల్? గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, సోమవారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బంగాల్?లో బీజేపీ ఘన విజయం సాధించింది. తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి అధికారాన్ని చేపట్టింది. అటు అసోంలో వరుసగా మూడో సారి అధికారాన్ని కైవసం చేసుకుంది.

## నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగుమం



అసోంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగుమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా చేశారు. ఈ మేరకు గువాహటిలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్యను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత కొద్దినిమిషాలకే హిమంత బిశ్వశర్మ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని హిమంతను, గవర్నర్ కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సీఎం ప్రమాణస్వీకారం మే 11 తర్వాత ఉంటుందని తెలిపారు. 'ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన తర్వాత రాజీనామా సమర్పించాం. ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కూడా నేను గవర్నర్‌ను అభ్యర్థించా. ఆయన నా రాజీనామాను అంగీకరించి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆదేశించారు. కొత్త ప్రభుత్వం త్వరలోనే ఏర్పడుతుందని నేను భావిస్తున్నా. ఈ సమయంలో మేం తాత్కాలిక ప్రభుత్వంగా పనిచేస్తాం' అని బిశ్వ శర్మ పేర్కొన్నారు.

**కొత్త సీఎం ఎంపిక శాసనసభ్యుల సమావేశంలోనే**

పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో నూతన సీఎం ఎంపిక జరుగుతుందని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రిని బీజేపీ శాసనసభ్యుల సమావేశంలోనే ఎంపిక చేస్తామని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జేపీ నడ్డా, బరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనిను కేంద్ర పరిశీలకులుగా నియమించారు. శాసనసభ్యుల సమావేశంలో నేతను ఎన్నుకుంటాం. ఆ తర్వాత లోక్ భవన్‌కు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు కోసం గవర్నర్‌ను కలుస్తాం. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం మే 11 తర్వాత జరిగే అవకాశం ఉంది. మహోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాం. ఈసారి సెంచరీతో హ్యాట్రిక సాధించినందుకే ప్రధానిని ఆహ్వానిస్తున్నాం' అని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. అసోం నూతన సీఎంగా మరోసారి హిమంత బిశ్వశర్మ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది.

**డిజిటల్ స్ట్రాటజీతో ప్రచారం**

అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయానికి డిజిటల్ వ్యూహం కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహం వల్ల ఎన్?డీఏ 100కి పైగా స్థానాలు సాధించింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చింది. బీజేపీ డిజిటల్ టీమ్, సోషల్ మీడియాలో కథనాలు, మీమ్స్, యువతను ఆకట్టుకునే కంటెంట్ ద్వారా ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా తమవైపు మళ్లించింది.

**'మామా' ఇమేజ్‌తో ప్రజలలో విశ్వాసం**

సీఎం హిమంత బిశ్వ శర్మను 'మామా'గా ప్రజల్లో ప్రతిష్ఠిస్తూ, ఆయనను స్థానిక సంస్కృతికి రక్షకుడిగా చూపించింది. అభివృద్ధి, ఆధునికత, ప్రాంతీయ గౌరవం అనే అంశాలను కలిపి బలమైన కథనాన్ని రూపొందించింది. ఈ డిజిటల్ ప్రచారం ద్వారా ప్రతిపక్షాన్ని, ముఖ్యంగా కాంగ్రెస్?ను తీవ్రంగా లక్ష్యంగా చేసుకుంది. బీజేపీ ప్రచారం కాంగ్రెస్‌ను అసోం అభివృద్ధికి అడ్డంకిగా చూపించింది. అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తోందనే ఆరోపణలతో కాంగ్రెస్‌పై ప్రతికూల భావనను పెంచింది. ఈ నారేటివ్ ప్రజల్లో విస్తృతంగా వ్యాపించి, ప్రతిపక్షానికి పెద్ద దెబ్బగా మారింది.

**ఎన్నికల్లో ఎన్‌డీఏ ఆధిపత్యం**

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్?డీఏ ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాల్లో 102 సీట్లు గెలుచుకుని వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతోంది. బీజేపీ 82 స్థానాలు గెలుచుకోగా, ఏజీపీ, బీఓపీఎఫ్ తలో 10 స్థానాలు సాధించాయి. ఇక కాంగ్రెస్ కేవలం 19 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. రైజోర్ దళ్ 2 స్థానాలు గెలుచుకోగా, ఏఐయూడీఎఫ్ కూడా 2 స్థానాలు సాధించింది. అసోం జాతీయ పరిషత్ (ఏజేపీ) ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది.

## పంజాబ్‌లో హైఅలర్ట్

పంజాబ్ వరుస పేలుళ్లతో దద్దరిల్లింది. రెండు గంటల్లోనే 2 చోట్ల పేలుళ్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ రెండు ఘటనలూ ఆర్మీ యూనిట్‌లకు సమీపంలోనే జరగడం మరింత ఆందోళనలకు గురు చేస్తోంది. జలంధర్, అమృత్‌సర్ నగరాల్లో ఈ పేలుళ్లు జరిగాయి. దీంతో పంజాబ్ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలోనే స్పందించిన అధికారులు, ఈ పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపైనా దర్యాప్తు చేపట్టారు. అటు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సైతం ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించనున్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో బీఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయం గేటు వద్ద స్కూటర్ పేలుడు కలకలం రేపింది. కంటోన్మెంట్ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. భద్రత పరంగా అత్యంత సున్నితమైన ప్రదేశంలో భారీ పేలుడు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సాంకేతిక కారణాలా లేక కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలో పేలుడు ఘటన నమోదైంది. రాత్రి దీఖీ హెడ్‌క్వార్టర్స్ ముందు ఉన్న యాక్టివ్ స్కూటర్ ఒక్కసారిగా పేలిపోయింది. వెంటనే మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడున్న యువకుడు పారిపోతున్నట్లు కనిపించింది. పెద్ద శబ్దంతో పేలుడు జరగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులు డ్వాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. మిలటరీ కంటోన్మెంట్ మొత్తాన్ని దిగ్బంధించి సోదాలు చేస్తున్నారు. నిఘా, పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ఫుటేజీలో కనిపిస్తున్న యువకుడిని గుర్తించి, అతని కదలికలను పరిశీలించేందుకు ప్రయత్నిస్తున్నారు. జలంధర్ నగరం అంతటా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

**కంటోన్మెంట్ పరిధిలో పేలుడు**

మరోవైపు ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత అమృత్‌సర్‌లో మరో పేలుడు జరిగింది. అటారీ రోడ్డులోని ఆర్మీ ఖాసా కంటోన్మెంట్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రదేశంలో రేకును పోలిన శకలాలు దొరికాయని, దీంతో ఎవరో పేలుడు పరికరాన్ని విసరడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, దాడి చేసి, ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలింది. అయితే, ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. పేలుళ్ల ఘటనపై స్పందించిన ప్రతిపక్షాలు, ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించాయి.

**జంట పేలుళ్లను చిన్నవిగా అభివర్ణించిన పంజాబ్ ముఖ్యమంత్రి**

అమృత్‌సర్, జలంధర్‌లో జరిగిన జంట పేలుళ్లను చిన్నవిగా అభివర్ణించారు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్. రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఆ పార్టీ ఈ విధంగానే సిద్ధమవుతోందని ఆరోపించారు. బీజేపీ భయానక వాతావరణం సృష్టించాలని చూస్తోందని, ప్రజలను భయపెట్టి ఓట్లు రాబట్టాలని ఆ పార్టీ భావిస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన చెప్పారు. "బీజేపీ ఒక మతతత్వ పార్టీ. బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు పంజాబ్ వంతు అని బీజేపీ చెబుతోంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగానే ఈ చిన్నపాటి పేలుళ్లు జరిగాయనిపిస్తోంది. ఇలాంటి ఎత్తుగడలను మానుకోవాలని నేను బీజేపీని కోరుతున్నాను. పంజాబ్ ఒక శాంతియుత రాష్ట్రం. మేము ఎల్లప్పుడూ ప్రపంచ సంక్షేమాన్ని కోరుకునే వాళ్లం." అని ముఖ్యమంత్రి అన్నారు.

**పాకిస్థాన్ పన్నిన 'ఐఎస్ఐ' కుట్రలో భాగంగానే పేలుళ్లు : డీజీపీ**

అమృత్‌సర్, జలంధర్‌లలో జరిగిన స్వల్ప తీవ్రత గల పేలుళ్ల ఘటనా స్థలాలను పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గౌరవ్ యాదవ్ బుధవారం పరిశీలించారు. రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించేందుకు పాకిస్థాన్ మద్దతు ఉన్న శక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. పంజాబ్‌లో అశాంతి సృష్టించేందుకు పాకిస్థాన్ పన్నిన 'ఐఎస్ఐ' కుట్రలో భాగంగానే ఈ ఘటన కనిపిస్తోందని డీజీపీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ వార్షికోత్సవం నేపథ్యంలో పంజాబ్‌లో అల్లర్లు సృష్టించేందుకు పాకిస్థాన్ ఐఎస్ఐ పన్నిన కుట్రలో ఇది ఒక భాగమని మేము అనుమానిస్తున్నామన్నారు.

# రాష్ట్రంలో భూముల మార్కెట్ విలువ పెంపునకు ప్రభుత్వం రంగం సిద్ధం!

-మొదటిపేజీ తరువాయి
మొదలయ్యాయి. ప్రస్తుతం ఈ విలువల పెంపు ఎందుకు అవసరం అయింది? ఎంత మేర పెరగొచ్చు ఎవరికెంత ప్రభావం? అనే వివరాలు తెలుసుకుందాం.

**అసలెందుకీ మార్పులంటే**

తెలంగాణలో ప్రభుత్వానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు ప్రధాన ఆదాయ వనరు హైదరాబాద్ మెట్రో ప్రాంతం. మొత్తం రిజిస్ట్రేషన్ రాబడిలో సుమారు 60 శాతం వరకు ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాల నుంచే వస్తోంది. ప్రభుత్వం నిర్ణయించే రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు, బహిరంగ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతున్న ధరల కంటే చాలా తక్కువగా ఉన్నాయి. కోకాపేట, నర్సింగి, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ మార్కెట్‌లో ఎకరానికి రూ.150 కోట్లకు పైగానే ధర పలుకుతున్నప్పటికీ, ఇక్కడ రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ చాలా తక్కువగా ఉంది. ఇందువల్ల ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి పెద్ద ఎత్తున గండిపడుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

అంతేకాదు, ఈ వ్యత్యాసం వల్ల అండర్ వాల్యుయేషన్‌కు అవకాశం ఉండడం, ప్రభుత్వానికి రెవెన్యూ నష్టం కలగడం, రియల్ ఎస్టేట్ ట్రాన్సాక్షన్‌లలో పారదర్శకత తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ వ్యత్యాసం అనేక సంవత్సరాలుగా కొనసాగుతోంది. టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 2022లో ఒకసారి మార్కెట్ విలువలు పెంచారు. 2025లో మరోసారి సవరణ చేసి కొన్ని హై గ్రోత్ జోన్లలో 30 నుంచి 50 శాతం వరకు పెంపు చేశారు. అయినా కూడా బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే గ్యాప్ భారీగానే కొనసాగుతోంది. ఈ గ్యాప్‌ను తగ్గించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఇప్పటికే రెండుసార్లు సమగ్ర సర్వేలు నిర్వహించింది.

**15-20 శాతం మార్కెట్ విలువ పెంచే దిశగా**

జిల్లా స్థాయిలో ఫీల్డ్ ఇన్‌పుట్స్ తీసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల, పంచాయతీ ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు వంటి రాజకీయ కారణాల వల్ల ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేకపోయింది. రెండుసార్లు కసరత్తు పూర్తి చేసినప్పటికీ అమలు దశలో ఆగిపోవడంతో, పాత డేటా ఇప్పుడు ఉపయోగపడదని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు భావిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వ ఆర్థిక సలహాదారుతో సమావేశం తర్వాత, ఆయన సూచనలు తీసుకుని అవసరమైతే మళ్లీ కసరత్తు చేయాలని అధికారులు నిర్ణయించారు.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సగటున 15 నుంచి 20 శాతం వరకు రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు పెంచే దిశగా కసరత్తు చేస్తోంది. కొన్ని హాట్‌స్పాట్ ప్రాంతాల్లో ఇది 50 శాతం



అంతకంటే ఎక్కువ కూడా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నెల 26వ తేదీ తర్వాత ఎప్పుడైనా కొత్త రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు అమలులోకి వచ్చే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు, బహిరంగ మార్కెట్ విలువలను సమన్వయం చేస్తూ, ప్రస్తుతం అమలులో ఉన్న విలువలను పరిగణనలోకి తీసుకుని కసరత్తు కొనసాగుతోందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెలిపారు.

**ఈ ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగే అవకాశం**

ఈ సవరణతో ప్రధానంగా ప్రభావితం అయ్యే ప్రాంతాలు ఓఆర్ఆర్ కారిడార్, జీహెచ్ఎంసీ కోర్ ఏరియా, అర్బన్ గ్రోత్ జోన్లు. అలాగే వేగంగా అభివృద్ధి చెందిన కొంపల్లి, మేడ్చల్, నర్సింగి, మానికొండ, అదిభట్ల, శంషాబాద్, తుక్కుగూడ, టెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం వంటి ప్రాంతాలు ఈ సవరణలో కీలకం కానున్నాయి. ఈ ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇందుకు ఐటీ విస్తరణ, ఫార్మా సిటీ, ఏరోసిటీ ప్రాజెక్టులు, మెట్రో ఎక్స్‌పాన్షన్, రింగ్ రోడ్లు, రేడియల్ రోడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధి ప్రధాన కారణాలు. ఈ విలువల పెంపు వల్ల సుమారు రూ.2,000 కోట్ల అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**పెరగనున్న రిజిస్ట్రేషన్ ఛార్జీలు**

ప్రస్తుతం తెలంగాణలో స్థిరాస్తి రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువపై మొత్తం 6 శాతం చార్జీలు అమల్లో ఉన్నాయి. అందులో స్టాంప్ డ్యూటీ 4 శాతం, ట్రాన్స్‌ఫర్ డ్యూటీ 1.5 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజు 0.5 శాతం ఉన్నాయి. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ పెరిగితే ఈ శాతం మారకపోయినా, రిజిస్ట్రేషన్ చార్జీలు గణనీయంగా పెరుగుతాయి. ఉదాహరణకు, ఇప్పటివరకు రూ.50 లక్షలుగా ఉన్న ఆస్తి రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువ, పెంపు తర్వాత రూ.70 లక్షలకు చేరితే, రిజిస్ట్రేషన్ ఖర్చు సుమారు మూడు లక్షల నుంచి నాలుగు లక్షల ఇరవై వేల వరకు పెరుగుతుంది. దీని ప్రభావం మొదటిసారి గృహాలు కొనుగోలు చేసే వారిపై పడే అవకాశం ఉంది. చిన్న పెట్టుబడిదారులు వెనకడుగు వేసే పరిస్థితి ఏర్పడవచ్చు. అలాగే రియల్ ఎస్టేట్ డిమాండ్ తాత్కాలికంగా మందగించే అవకాశం ఉంది. అయితే మరోవైపు పారదర్శక లావాదేవీలు పెరగడం, అండర్ రిజిస్ట్రేషన్ తగ్గడం, ప్రభుత్వ ఆదాయం పెరగడం వంటి సానుకూల అంశాలు కూడా ఉన్నాయి. రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువలు పెంపు ప్రకటించిన వెంటనే పెండింగ్ డీల్స్ పూర్తి చేసుకునేందుకు కొనుగోలుదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పనులపై సమగ్రంగా పూర్తి వివరాలు సమర్పించండి

-మొదటిపేజీ తరువాయి
సమీక్షలో చర్చకు వచ్చాయి. 0.2 టీఎంసీ సామర్థ్యం గల చెరువు నుంచి ఐదు టీఎంసీల నీటిని ఎలా ఇవ్వగలరని, పనులు చేపట్టడం, తర్వాత సమస్యలు రావడం కాకుండా అన్ని అంశాలను సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మల్లన్నసాగర్ వరకు చేపట్టిన అదనపు టీఎంసీ పనులు కూడా ఆగిపోయాయి.

**ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు అదనపు టీఎంసీ**

ఈ పనులు పూర్తయితే గానీ మల్లన్నసాగర్ నుంచి లక్ష్యం మేరకు నీటిని ఇవ్వడం ఏ మాత్రం వీలుకాదు. మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్ తాగునీటికి, మూసీ పునరుజ్జీవనానికి 20 టీఎంసీల వినియోగంతో పనులను చేపట్టారు. ఈ పనులు ప్రారంభమై వేగంగా జరుగుతున్నాయి. రెండేళ్లలో వీటిని పూర్తి చేయాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకొంది. ఈ నీటి మళ్లింపు పథకం పూర్తయి ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్‌కు అదనపు టీఎంసీ నీటిని మళ్లించే పనులు పూర్తికాకుంటే సమస్య ఉత్పన్నం కావడం తద్యం. ఈ పనుల్లో 60 నుంచి 70 శాతం వరకు ఇప్పటికే పూర్తయ్యాయి.

సర్జ్‌పూల్‌లు, పంపుహౌస్‌లు, డెలివరీ సిస్టర్న్ లాంటి పనులు 80 నుంచి 90 శాతం జరగగా మరో రూ.13 వేల కోట్లు ఖర్చు చేస్తే మొత్తం పనులు పూర్తవుతాయని అధికారులు నివేదికలు సమర్పించారు. ప్యాకేజీల వారీగా వివరాలు అందజేయాలని సీఎం సూచించినట్లు సమాచారం. చేయాల్సిన పని, ఇప్పటివరకు జరిగిన పని, భూసేకరణ ఇంకా ఎంత చేయాలి, పెండింగ్ బిల్లుల మొత్తం ఎంత ఉన్నాయి, ప్రస్తుతం పనులు పూర్తి చేయాలంటే వాస్తవంగా ఎంత బడ్జెట్ అవసరం ఇలా అన్ని వివరాలను సమగ్రంగా వారం రోజుల్లో అందజేయాలని ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

పనుల పూర్తికి ఆటంకంగా ఉన్న అన్ని రకాల సమస్యలు



నివేదికలో ఉండాలని స్పష్టం సీఎం చేసినట్లు తెలిసింది. దీంతో పాటు మల్లన్నసాగర్ దిగువన ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు, కాలువల పనులు, రిజర్వాయర్ల నిర్మాణం ఇలా అన్ని వివరాలను అందజేయాలని సూచించడంతో ఈ వివరాల తయారీలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు.

**నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించకుండా చెప్పొద్దు**

ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు ప్రాణహిత నది నీటిని మళ్లించే పథకం గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల శాఖ అధికారులు మరోసారి పవర్? పాయింట్? ప్రజంటేషన్ ఇచ్చారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మాణ స్థలం, పూర్తి స్థాయి నీటిమట్టం 150 మీటర్లు లేదా 149 మీటర్లు ఇలా పలు అంశాలపై సోమవారం క్యాబినెట్ సమావేశానికి ముందుగా కన్సల్టెన్సీ సంస్థ, నీటిపారుదల శాఖ అధికారులతో చర్చ జరగ్గా, నిర్మాణ స్థలాన్ని పరిశీలించారా? అని సీఎం ప్రశ్నించినట్లు విశ్వసనీయ సమాచారం.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించకుండా చెప్పొద్దని, గాలిలో మేడలు కట్టొద్దని, గత అనుభవాలను చూసి కూడా మళ్లీ అలాగే వ్యవహరిస్తే ఎలా అని కొంతమంది అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తుది నిర్ణయం తీసుకొని ఇప్పుడు పని ప్రారంభించగలమా? అని ప్రశ్నించగా పర్యావరణ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు ఆయనకు తెలిపారు. ఇప్పటివరకు ఏం చేశారని, పని ప్రారంభించడానికి ముందు అవసరమైన ప్రక్రియ పూర్తి చేయకుంటే పనుల్లో తీవ్ర జాప్యం జరిగి రాష్ట్ర ఆర్థికంపై భారం పడుతుందని, ఈ పరిస్థితిని రానీయొద్దని స్పష్టం చేసినట్లు తెలిసింది.

# 8 నుంచి జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు

**హైదరాబాద్ :** రాష్ట్రంలో 2026 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ షెడ్యూల్‌ను తెలంగాణ ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఇంటర్ ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీల్లో తొలి విడత అడ్మిషన్లు ఈ నెల 8 నుంచి చేపట్టనున్నారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. దరఖాస్తులకు చివరి తేదీ 31 కాగా, మొదటి విడత అడ్మిషన్ల గడువు ముగింపు జూన్ 30తో ముగుస్తుంది. ఈ ఏడాది అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా 'యాంటీ అఫిడవిట్'ను సమర్పించాల్సి ఉంటుం ది. ఎప్పటిలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రవేశాల్లో రిజర్వేషన్లు పాటించాలని ఈ మేరకు ప్రిన్సిపాల్స్‌కు బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలకు 29 శాతం, ఈడబ్ల్యూఎస్‌లకు 10 శాతం సీట్లు కేటాయిం చారు. ప్రత్యేక కళాశాలలు లేనిచోట బాలికల కోసం 33.33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రైవేట్ కాలేజీలు తప్పుడు ప్రకటనలు ఇవ్వకూడదని, సీట్ల వివరాలు ప్రతిరోజూ నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులు బోర్డు గుర్తింపు పొందిన అఫిలియేటెడ్ కాలేజీల్లోనే చేరాలని, ఆ జాబితా బోర్డు వెబ్‌సైట్‌లో ఉందన్నారు. ఒక్కోసెక్షన్‌లో గరిష్ఠంగా 88 మంది విద్యార్థులకే అనుమతినిచ్చారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు.

## మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించండి

-మొదటిపేజీ తరువాయి
ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2 సమగ్ర ప్రణాళికను రూపొందించి ఇప్పటికే డీపీఆర్ సమర్పించినట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. దిల్లీలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ మెట్రో ఫేజ్- రెండో దశ, మెట్రో ఫేజ్-3పై చర్చించారు.

**ఇప్పటికే మొదటి దశను స్వాధీనం చేసుకున్నాం**

వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రో సేవలను మరింతగా విస్తరించాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి దృష్టికి రేవంత్ తీసుకెళ్లారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సజావుగా సాగే ఉద్దేశంతోనే మెట్రో ఫేజ్-మొదటి దశను ఎల్ అండ్ టీ, హెచ్?ఎంఆర్ఎల్‌ని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి ఖట్టర్‌కి వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో ఫేజ్-2, ఫేజ్-3 విస్తరణ సులువు అవుతుందని గుర్తుచేశారు.

జాయింట్ వెంచర్‌గా చేపట్టాలి

హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్ విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో 122.9 కిలో మీటర్ల మేర విస్తరణకు రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను సమర్పించినట్లు సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని ఖట్టర్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి కె. శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, దిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్?తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజు నియంత్రణకు అథారిటీ ఏర్పాటు చేయాలి

-మొదటిపేజీ తరువాయి
ఫీజులు ఎంత పెంచినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటామంటే కుదరదని హెచ్చరించారు. ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రి ఉండటం రాష్ట్రానికి దౌర్భాగ్యమైన పరిస్థితిగా మారిందన్నారు. 50 నుంచి 120 శాతం ఫీజులు పెరిగినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. పిల్లల చదువు బాధ్యత కేవలం తల్లిదండ్రులది మాత్రమే కాదని ప్రభుత్వ పాత్ర కూడా ఉండాలని గుర్తుచేశారు.

**ఫీజులపై పట్టించుకోమంటే కుదరదు**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అవతరించిన తర్వాత ఫీజుల నియంత్రణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం తిరుపతిరావు కమిషన్ వేసిందని కవిత తెలిపారు. ఆ కమిషన్ అధ్యయనం చేసి స్పష్టమైన నివేదికను కూడా ఇచ్చినట్లు గుర్తుచేశారు. కానీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో కేసీఆర్? సర్కార్ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని మండిపడ్డారు. గురుకులాలు ఏర్పాటు చేశామని ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోబోమంటే కుదరదని తేల్చి చెప్పారు. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా ఫీజు నియంత్రణ కోసం పర్మినెంట్ అథారిటీ ఉండాలని లేదంటే గుజరాత్?లో మాదిరిగా ప్రాథమిక విద్యకు 15 వేలు, ఉన్నత విద్యకు 25 వేలకు మించి ఫీజు ఉండొద్దనే రెండు అంశాల్ని ఆమె ప్రత్యామ్నాయంగా ప్రభుత్వానికి సూచించారు.

ఏం సందేశం ఇస్తున్నారు : మన రాష్ట్రంలో 64 లక్షల మంది విద్యార్థులు ఉంటే 65 నుంచి 75 శాతం వరకు ప్రైవేటు పాఠశాలల్లోనే చదువుతున్నారని కవిత అన్నారు. ఈ ప్రభుత్వం కచ్చితంగా కార్పొరేట్ స్కూళ్ల దోపిడీని నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన జీవోను తక్షణమే జారీ చేయాలన్నారు. గతేడాదితో పోలిస్తే ఒక్క రూపాయి కూడా ఫీజు పెంచకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ముఖ్యమంత్రి ప్రైవేట్ స్కూల్స్ ఓపెనింగ్‌లకు వెళ్తూ ఏం సందేశం ఇస్తున్నట్లు? ప్రైవేట్ విద్యాసంస్థలను దోపిడీని ముఖ్యమంత్రే ప్రోత్సహిస్తున్నట్లా? అని కవిత ప్రశ్నించారు.

"ఇప్పుడున్న విద్యాసంస్థలు చాలా వరకు వ్యాపార ధోరణితోనే కొనసాగుతున్నాయి. వాటిలో రాజకీయ నాయకులకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయని అందరికీ తెలిసిన విషయమే. రాజకీయ నాయకులకు విద్యాసంస్థలు ఉండటమనేది సరైనదేనా అని మనందరం ఒకసారి ఆలోచించాలి. అదే విధంగా ఫీజుల దోపిడీకి ఇప్పుడే అంటే మే నెలలోనే పరిష్కారం కావాలి. ఎందుకంటే పిల్లల ఫీజులు కట్టాలంటే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు" -కల్వకుంట్ల కవిత, టీఆర్?ఎస్ అధ్యక్షురాలు

## తెలంగాణలో కమల వికాసం సాధ్యమేనా

**హైదరాబాద్ :** పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు భారత రాజకీయ యవనికపై కొత్త చర్చకు తెరలేపాయి. ఆ రాష్ట్రంలో ఒక సామాన్య మహిళ సాధించిన విజయం సృష్టించిన ప్రకంపనలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి. ఒక యుద్ధం ముగియగానే మరో యుద్ధానికి సన్నద్ధమవ్వడం రాజకీయ వ్యూహకర్తల నైజం. ఈ క్రమంలోనే అందరి చూపు ఇప్పుడు దక్షిణ భారతం వైపు, ముఖ్యంగా భాగ్యనగర వేదికగా సాగుతున్న పరిణామాల వైపు మళ్లింది. అగ్రరాజకీయ పీఠంపై కన్నేసిన ఒక జాతీయ పార్టీ, తన తదుపరి లక్ష్యాన్ని అత్యంత స్పష్టంగా ప్రకటించడంతో తెలంగాణ రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికారం చేపట్టిన పార్టీలు ఒకవైపు, కోల్పోయిన వైభవాన్ని వెతుక్కునే శక్తులు మరోవైపు.. వెరసి తెలంగాణ గడ్డ ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు అడ్డాగా మారింది. బీజేపీ పశ్చిమ బెంగాల్ విజయ ఉత్సాహంతో ఉన్న బీజేపీ, ఇప్పుడు తన నెక్ట్స్ టార్గెట్ ను ఫిక్స్ చేస్తూ ఒక ట్వీట్ చేసింది. తదుపరి లక్ష్యం తెలంగాణే అని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ చేసిన ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాకుండా, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. బెంగాల్ తరహా వ్యూహాలను ఇక్కడ కూడా అమలు చేయాలని, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర నాయకత్వానికి అగ్రనాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత పటిష్టమైన పట్టు సాధించేందుకు తెలంగాణను సరైన వేదికగా కమలం పార్టీ భావిస్తోంది.. తెలంగాణలో బీజేపీకి కేడర్ పరంగా ఎంతో బలం ఉంది. గత రెండు అసెంబ్లీకి జరిగిన పోలింగ్ ను పరిశీలిస్తే ఓట్ షేరింగ్ శాతం పెరుగుతూ వస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ స్థాయిలో కొన్ని లోపాలు ఉన్నాయని పార్టీ అంతర్గత విశ్లేషణలో తేలింది. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు పోరాడటానికి సిద్ధంగా ఉన్నా, నడిపించే విషయంలో అగ్ర నాయకత్వం ఆశించిన స్థాయిలో దూకుడు ప్రదర్శించడం లేదని భావిస్తున్నారు. ముఖ్యంగా నాయకుల మధ్య ఐక్యత, సమన్వయ లోపం వంటివి పార్టీ ఎదుగుదలకు అడ్డంకిగా మారాయి. పార్టీలోని లోపాలపై కార్యకర్తలు బహిరంగంగానే అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అగ్ర నాయకత్వంలో ఐక్యత పెరగాలని, అప్పుడే అధికార పార్టీలను ఢీకొనడం సాధ్యమవుతుందని కేడర్ గట్టిగా నమ్ముతోంది. కాంగ్రెస్ బలం తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు బీజేపీకి సవాల్‌గా మారాయి. ఇటీవల జరిగిన జగిత్యాల సభ, బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేసీఆర్ చేసిన ప్రసంగం ఆ పార్టీ శ్రేణుల్లో కొత్త ఊపు తీసుకొచ్చింది. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న అనుభవం, క్షేత్ర స్థాయిలో పట్టు బీఆర్ఎస్‌కు బలం పెంచుతున్నాయి. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం వల్ల సహజంగానే ఆ పార్టీకి పాలనాపరమైన అనుకూలత ఉంది. ఈ రెండు బలమైన శక్తులను ఒకేసారి ఎదుర్కోవాలంటే కేవలం మాటలతో సరిపోదని, వ్యూహాత్మకమైన అడుగులు వేయాలని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్యకర్తల ఆకాంక్ష.. రాష్ట్ర నాయకత్వ పరిస్థితి అలా ఉండగా.. సాధారణ కార్యకర్తలు పార్టీ నుంచి తీవ్రమైన పోరాటాన్ని కోరుకుంటున్నారు. ప్రత్యర్థి పార్టీలు దూకుడుగా వెళ్తున్న తరుణంలో, బీజేపీ కూడా అంతే వేగంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆశిస్తున్నారు. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు, ప్రభుత్వంపై ఒత్తిడి తేవ డం వంటి కార్యక్రమాల ద్వారానే ఉనికిని చాటుకోవచ్చని భావిస్తున్నారు. బెంగాల్‌లో సా మాన్యుల నుంచి నాయకులను తయారు చేసినట్లే, ఇక్కడ కూడా స్థానిక సమస్యలపై స్పం దించే నాయకత్వాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో కమల నాథుల వ్యూహం తెలంగాణను గెలుచుకోవాలనే లక్ష్యం గొప్పదే అయినా, ఎంత వరకు సాధ్య మవుతుందనేది వారి వ్యూహాలపై ఆధారపడి ఉంటుంది. ఇతర పార్టీల నుంచి బల మైన నాయకులను ఆహ్వానించడం, క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలను మరింత బలోపేతం చే యడం వంటి పద్ధతులతో పాటు, తెలంగాణ సెంటిమెంట్‌ను ఎలా డీల్ చేస్తారనేది ఆసక్తి కరం. ఏది ఏమైనా, 'టార్గెట్ తెలంగాణ' అనే నినాదంతో బీజేపీ యుద్ధం ప్రకటిం చింది. మరి త్రిముఖ పోరులో కమలం ఏ మేరకు ప్రభావం చూపుతుందో కాలమే నిర్ణయించాలి.

## సంపాదకీయం

# మాస్‌తో పెట్టుకుంటే మడతే...

దేశ రాజకీయాల్లో చరిత్రలో గత రెండేళ్లు అత్యంత కీలకమైన మార్పులకు సాక్ష్యంగా నిలిచాయి. తమ రాష్ట్రాల్లో ఎదురులేని నాయకులుగా వెలుగొందిన అగ్రనేతలు నేడు తమ సొంత గడ్డపై ఓటమి పాలయ్యారు. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. 2026లో జరిగిన పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు మమతా బెనర్జీ రాజకీయ జీవితంలో ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయి. ముఖ్యమంత్రిగా ఉంటూ ఆమె తన సొంత నియోజకవర్గమైన భవానీపూర్‌లో పరాజయం పాలయ్యారు. భారతీయ జనతాపార్టీ అభ్యర్థి సువేందు అధికారి చేతిలో ఆమె 15వేల ఓట్లకుపైగా తేడాతో ఓటమి చెందారు. ఈ ఓటమిని మమతాబెనర్జీ జీర్ణించుకోలేకపోయారు. ఇది ప్రజాతీర్పు కాదని, కేవలం లూటీ మాత్రమేనని ఆమె తీవ్ర స్థాయిలో ఆరోపించారు. గత చరిత్రను పరిశీలిస్తే 2021 ఎన్నికల్లో కూడా ఆమె నందిగ్రామ్ నియోజకవర్గంలో ఇదే సువేందు అధికారి చేతిలో ఓడిపోయారు. అయితే అప్పట్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించడంతో ఆమె ముఖ్యమంత్రిగా కొనసాగారు. కానీ 2026లో పరిస్థితులు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక, బీజేపీ రాజకీయ వ్యూహాల ఒత్తిడి ఆమె పతనానికి దారి తీశాయి. దక్షిణ భారత రాజకీయాల్లో బలమైన నేతగా గుర్తింపు పొందిన ఎంకే స్టాలిన్‌కు కూడా 2026 చేదు అనుభవాన్ని మిగిల్చింది. మే 2026లో జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే అధినేత స్టాలిన్ తన నియోజకవర్గం కొలత్తూరులో ఊహించని విధంగా ఓడిపోయారు. వరుసగా మూడుసార్లు ఇక్కడి నుంచి గెలిచిన ఆయనకు ఈసారి ఓటరు మొహం చాటేశారు. టీవీకే పార్టీ అభ్యర్థి వీఎస్ బాబు చేతిలో ఆయన 8, 795 ఓట్ల స్వల్ప తేడాతో పరాజయం పాలయ్యారు. ఈ ఓటమి స్లాలిన్‌ను, డీఎంకే శ్రేణులను తీవ్ర ఆత్మరక్షణలోకి నెట్టింది. ఒక ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గంలో ఓడిపోవడం అనేది ఆ రాష్ట్రంలో మారుతున్న రాజకీయ గాలికి నిదర్శనంగా చెబుతున్నారు.గతంలో కూడా ఇలాంటి ఉద్దండులు ఓడిపోయిన చరిత్ర ఉంది. రాజకీయాల్లో అనతి కాలంలోనే అగ్రస్థానానికి చేరుకున్న అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ ఓటర్లు 2025లో షాక్ ఇచ్చారు. ఫిబ్రవి 2025లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఓటమి చెందారు. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ చేతిలో ఆయన సుమారు మూడు వేలకుపైగా ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారు. అధికారంలో ఉన్న వారు ఓడిపోవడం అనే ప్రక్రియ 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి ఊపందుకుంది. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. దీని వల్ల అప్పటి ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్(రాజస్థాన్), భూపేష్ బఘేల్(చత్తీస్‌గఢ్) తమ కుర్చీలను కోల్పోవాల్సి వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ స్పష్టమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. మమతా బెనర్జీ, స్టాలిన్, కేజ్రీవాల్ వంటి నాయకులు తమ సొంత నియోజకవర్గాల్లో ఓడిపోవడం అనేది కేవలం వ్యక్తిగత ఓటమి కాదు. పశ్చిమ బెంగాల్‌లోనని కీలకమైన నియోజకవర్గం భవానీపూర్‌లో హోరాహోరీ పోరు ముగిసింది. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో విజయం సాధించిన బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి, మమతా బెనర్జీని 15,114 ఓట్ల తేడాతో ఓడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గం ఆరంభం నుంచే అందరి దృష్టిని ఆకర్షించింది. యాదృచ్ఛికంగా, భవానీపూర్‌తో పాటు నందిగ్రామ్‌లో కూడా సువేందు అధికారి 9000కుపైగా ఓట్ల తేడాతో గెలుపొందారు. ఈ ఓటమి తృణమూల్‌కు, ముఖ్యంగా మమతాబెనర్జీకి బిగ్ షాక్ అనే చెప్పాలి. ఈసారి బెంగాల్‌లో కాషాయ తుపాను సంచలనాలు నమోదు చేసింది. చాలా జిల్లాల్లో కమలా పువ్వులు వికసించాయి. అనేక చోట్ల తృణమూల్ కాంగ్రెస్‌ను దాదాపుగా తుడిచిపెట్టేశారు. నందిగ్రామ్, భవానీపూర్ అనే రెండు నియోజకవర్గాల్లో సువేందు అధికారి పోటీ చేయంతో అందరి దృష్టి ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాలపై పడింది. నందిగ్రామ్‌లో సువేందు సమీప ప్రత్యర్థి తృణమూల్‌కు చెందిన పవిత్ర కర్. ఈ అభ్యర్థి ఎన్నికలకు ముందు బీజేపీని వీడి తృణమూల్‌లో టికెట్ పొందారు. ఈ పవిత్ర కర్ ఒకప్పుడు సువేందు సహాయంతో బీజేపీలో చేరారని వినికిడి. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్‌లో సువేందు ఈ అభ్యర్థిని ఓడించారు. అది ఆయా పార్టీల పతనాన్ని లేదా ప్రజల్లో ఉన్న ఆగ్రహాన్ని సూచించే కీలక సంకేతం. ఇక అస్సాంలో అస్సాం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చాయి. ముఖ్యంగా ఆ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న, మూడుసార్లు ఎంపీగా గెలిచిన గౌరవ్ గొగోయ్ తన సొంత ఇలాకా జోర్హాట్‌లో ఓటమి పాలవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ వారసుడిగా భారీ అంచనాలతో బరిలోకి దిగిన గౌరవ్.. బీజేపీ సీనియర్ నేత హితేంద్రనాథ్ గోస్వామి చేతిలో దాదాపు 22,000 ఓట్ల భారీ తేడాతో పరాజయం పాలయ్యారు. తన లోక్‌సభ పరిధిలోని దాదాపు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ పట్టు కోల్పోవడం గమనార్హం. గౌరవ్ గొగోయ్ ఓటమికి ప్రధాన కారణం ప్రజలకు అందుబాటులో లేకపోవడమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రచార సమయంలో ఆయన క్షేత్రస్థాయిలో తగినంతగా కనిపించలేదని.. కేవలం తన తండ్రి పేరు మీద, అహోం సామాజిక వర్గ సమీకరణాల మీద అతిగా ఆధార పడటం బెడిసి కొట్టిందని చెబుతున్నారు. అలాగే బీజేపీ వ్యూహాత్మకంగా గౌరవ్‌ను 'జాతీయ రాజకీయాలకు మాత్రమే సరిపోయే నేత'గా చిత్రీకరించడంలో సఫలమైందని పేర్కొంటున్నారు. స్థానిక సమస్యల కంటే ఢిల్లీ రాజకీయాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తారన్న ప్రచారం ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేసిందని వివరిస్తున్నారుభారత రాజకీయాల్లో ఇప్పుడు కొత్త నాయకత్వానికి, మార్పుకు సమయ ఆసన్నమైందని ఫలితాలు నిరూపిస్తున్నాయి. రాబోయే కాలంలో ఈ నాయకులు తిరిగి పంజుకుంటారా లేదా కొత్త శక్తులు మరింత బలోపేతం అవుతాయా అనేది వేచి చూడాలి.

# దీదీ ధిక్కార స్వరం!



తృణమూల్ కాంగ్రెస్ అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విలక్షణ నాయకురాలు. పదిహేనేళ్లపాటు అవిచ్ఛిన్నంగా రాష్ట్రాన్ని పాలించి తొలిసారి ఓటమి చవిచూసిన ఆమె దీన్ని తేలిగ్గా వదలదల్చుకోలేదని తాజా పరిణామాలు చెబుతున్నాయి. 'ఎన్నికల సంఘం(ఈసీ) ఆసరాతో మా గెలుపు కొల్లగొట్టారు. మేం ఓడిపోలేదు. కాబట్టి రాజీనామా చేసే ప్రసక్తే లేద'ని ఆమె బాంబు పేల్చారు. ఆమె అయిదేళ్ల పదవీకాలం ఎటూ ఈ నెల ఏడుతో ముగుస్తుంది. తాజా పరిణామాల నేపథ్యంలో గవర్నర్ ఈలోగానే ఆమె ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేస్తారా... లేక గడువు ముగిశాక ఆమెను సచివాలయంలోకి రాకుండా అడ్డుకుంటారా అన్నది చూడాల్సి ఉంది. ఓడిపోయినవారు ప్రత్యర్థి ఎన్నికను న్యాయస్థానంలో సవాలు చేసే ప్రత్యా మ్నాయం ఉంటుంది. అవన్నీ తేలటానికి ఏళ్లూ పూళ్లూ పడుతుంది. సీనియర్ నాయకు రాలు గనుక ఇవన్నీ ఆమెకు సంపూర్ణంగా తెలిసే ఉంటాయి. కానీ అక్కడితో ఆగిపోతే ఆమెకూ, ఇతర నాయకులకూ తేడా ఉండేది కాదు. వైదొలగక తప్పదని తెలిసినా తగినంత రచ్చచేసి నిష్క్రమించటం ఆమె ఎత్తుగడ కావొచ్చు. యూత్ కాంగ్రెస్ నాయకు రాలిగా పనిచేసినప్పటినుంచి మమత స్ట్రీట్ ఫైటర్. వామపక్ష ఫ్రంట్ ప్రభుత్వంపై సాగిస్తున్న పోరాటంలో పార్టీనుంచి సరైన సహకారం అందటం లేదన్న ఏకైక కారణంతో ఆమె కాంగ్రెస్‌ను విడిచిపెట్టారు. సొంతంగా తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఆ తర్వాత ఆమెదంతా అలుపెరగని పోరాట చరిత్ర. ఇంత రగడకు ఏకైక కారణం ఎన్నికల సంఘం(ఈసీ). స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట బిహార్‌లో అమలైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాక కూడా ఇతర రాష్ట్రాల్లోనైనా సజావుగా పూర్తి చేయాలన్న ఇంగిత జ్ఞానం ఆ సంస్థకు లేకపోయింది. బెంగాల్‌లో దాన్ని మరింత అధ్వాన్నం చేసింది. తొలగింపు ల్లోనూ, చేర్పింపుల్లోనూ అవకతవకలకు అంతూ దరీ లేకుండా పోయింది. ఫాం--7 కింద ఊరూ పేరూలేని వారు దాఖలు చేసిన ఫిర్యాదుల్ని ఆసరా చేసుకుని తాఖీదులు పంపడం, కావలసిన పత్రాలన్నీ ఇచ్చాక నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ కాలేదంటూ తొలగించటం వంటివి చోటుచేసుకున్నాయి. పేర్లలో అక్షర క్రమంలో స్వల్ప తేడాలొచ్చినా 'తార్కిక వ్యత్యాసం' పేరిట అనర్హులుగా జమేయటం మరో దాష్టీకం. ఏతావాతా 91 లక్షలమంది ఓటర్లు మాయమయ్యారు. పైగా ఏడు లక్షలమంది రహస్యంగా వచ్చిచేరారని మమత ఆరోపిస్తున్నారు. అజ్యుడికేషన్‌లో మాత్రం కేవలం 1,607 మందికి మాత్రమే ఓటుహక్కు పునరుద్ధరించారు. మిగిలిన లక్షలాది దరఖాస్తులు తేలడానికి ఎన్నేళ్లు పడుతుందో ఎవరూ చెప్పలేరు. ఓటుహక్కు ప్రసాదించే సంస్థ అనే ముద్రనుంచి దాన్ని తొలగించటమే ధ్యేయంగా పనిచేస్తున్న సంస్థగా ఈసీ పరివర్తన చెందటంలో మతలబేమిటి? సర్‌పై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా గత నెల 13న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం, ఓటర్ల జాబితాల్లో భారీస్థాయి తొలగింపులు జరిగితే అది ఎన్నికల ఫలితాలపై 'గణనీయమైన ప్రభావం' కలిగిస్తుందని వ్యాఖ్యానించింది. ఆ పరిస్థితే వస్తే ఏం చేయాలో ఆలోచిస్తామని కూడా చెప్పింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఎటూ విపక్షాలు సుప్రీంకోర్టు తలుపుతట్టే అవకాశం ఉంది. విచారకరమైన సంగతేమంటే... ఈ ఎన్నికల్లో తానూ ఒక అభ్యర్థినే అన్నట్టు ఈసీ ప్రవర్తించింది. వచ్చిన కేంద్ర పరిశీలకులు సైతం అందుకు తగినట్టే ఉన్నారు. మరి 'ఓట్ చోరీ' ఆరోపణలు రావటంలో వింతేముంది? ఆంధ్రప్రదేశ్‌లో 2024 నాటి ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై ఇంతవరకూ ఈసీ చేష్టలుడిగినట్టు ఉండిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ చేసిన ఫిర్యాదులకు అతీ గతీ లేదు. నిమిషానికి నలుగురు చొప్పున ఓటేయటం గురించీ, సీసీ టీవీ ఫుటేజ్ మాయం చేయటం గురించీ పరకాల ప్రభాకర్ వంటి సామాజికవేత్తలు ప్రశ్నిస్తుంటే మన్నుతిన్న పాములా కూర్చుంది. ఏ సంస్థా ఇంత సిగ్గుమాలినతనాన్ని ప్రదర్శించిన వైనం దేశ చరిత్రలో ఎన్నడూ లేదు. కనీసం ఇప్పుడు సర్ ప్రారంభించబోయే రాష్ట్రాల్లోనైనా సక్రమంగా ప్రవర్తించటం ఈసీ నేర్చుకోవాలి. లేనట్టయితే అక్కడ కూడా ఇలాంటి ఛీత్కారాలే ఎదురవుతాయి.

# సాగు బాగు కోసం సంగ్రామం



'పొలాలకు పోతూ, వస్తూ ఎదురుపడ్డోళ్లమంతా ఎదల దుఃఖం పంచుకుంటున్నాం' అని ఇటీవల గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా పలుకరిస్తే, జంగిలప్ప అనే రైతు నాతో ఆవేదనను పంచుకున్నాడు. 'రైతుకు ఏమియ్యకున్నా పురస్తేగాని, కనీసంగా పట్టింపు కూడా లేదని అర్థమైనాక అనాథలతీరైతిమని, రెక్కల కష్టం తప్ప మరేపనీ ఎరుగని రైతు లోలోపల తల్లడిల్లిపోతడన్న' అంటూ ఇంజన్న అనే పేద రైతు జతకూడి చెప్తుంటే అక్కడున్న మా అందరిలో ఆవేదన కలిగింది. ఇప్పుడు ఏ ఊర్లో, ఏ రైతును పలుకరించినా ఆ రైతుల్లానే వేదనను వెళ్లగక్కుతున్నారు. వదిలించుకున్న వేదనను మళ్లీ తగిలించుకొని విలవిల్లాడిపోతున్నారు. తెగులంటుకున్న తెలంగాణల గ్రామాలన్నీ దిగులంటుకొని దినదిన గండంలా గడుపుతున్నాయి. ఏ పీడదినాలైతే మళ్లీ కలలో కూడా రాకూడదని పోరాడారో అవే కల్లంలోకి, అందరి పల్లెంలోకి వచ్చి పడ్డాయి. రెండున్నరేండ్లుగా రేవంత్ సర్కార్ రీతిలేని పనితీరు వల్ల, రాష్ట్ర పునాది రంగంలో పస్తుల విధానం పునరావృతమయ్యింది. దశాబ్దాల పోరాటం, తొమ్మిదిన్నరేండ్ల ప్రగతి విప్లవ ఫలాలు బాల నాగమ్మ కథ సినిమాలో మాయలఫకీరు నాగమ్మను మాయం చేసినట్లు అయిపోయాయి. నిజానికి దశాబ్దాల విధ్వంస, వివక్షా విధానాల బారినపడి అప్పులు తప్ప ఏవీ పండవని ఆశలు చాలించుకున్న సాగు రంగాన్ని సస్యశ్యామలం చేయటానికి కేసీఆర్ ప్రభుత్వం పడరాని పాట్లెన్నో పడింది. రాష్ట్ర ఏర్పాటుకు మునుపు వ్యవసాయం దండగ లాంటి అనేక మాటలు పాలకుల నోటి వెంటే వినీవినీ, నీళ్లు లేక, కరెంట్ రాక రాత్రీపగలూ సేను సెలకల కోసం చకోరపక్షుల్లా బతికిన రైతులు వ్యవసాయంపై విశ్వాసం వదిలేశారు. ఆశ, ఆత్మవిశ్వాసం ఆవిరైన అన్నదాతలు అప్పులు, ఆత్మహత్యలు భరించలేక సేద్యానికి సెలవని వలసల జీవితం ఎంచుకున్నారు. అలాంటి అభద్రతాభావంలో తలమునకలై ఉన్న రైతు లోకంలో విశ్వాసం వికసింపజేయటానికి బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వశక్తులు వొడ్డింది. బీఆర్ఎస్ సర్కార్ తెలంగాణ చారిత్రక నేపథ్యం, భౌగోళిక స్థితిగతులు, సామాజిక అవసరాలపైనే ఆర్థిక నమూనాను రూపొందించుకొని అమలుపరిచింది. పునాదిలో ఆరోగ్యకర స్థితిని స్థిరపరచకుండా, ఉపరితలంలో ఏ ఆర్థిక నమూనాతో ఊరేగినా వొరిగేదేమీ ఉండదనే దృష్టికోణం కలిగిన సర్కార్ కాబట్టే రైతు సంక్షేమ పథకాలను అత్యంత ప్రాధాన్యంగా ఆచరించింది.తెలంగాణ వార్తలు సాగునీరు, విద్యుత్తు, విత్తన పంపిణీ, పంటల కొనుగోలు ఇలా అన్నింటా ప్రతి ఏటా ఏమరుపాటుతో నడుచుకున్నది. అయితే ఏడు దశాబ్దాలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమ పథకాల పేరిట అనుసరించిన మూస, మోస విధానాల వొరవడికి స్వస్తిపలికి వ్యవసాయరంగ శాశ్వత స్థిరీకరణకు లోతైన, మానవీయ నమూనాను కేసీఆర్ సర్కార్ సాగు రంగంలో అమలు చేసింది.

గుండెల నిండా తెలంగాణ తప్ప మరే ధ్యాస లేని గుణమున్న సర్కార్ కాబట్టే చెరువుల నుంచి నదుల వరకు ఏ నీటిబొట్టునూ వదలకుండా వొడిసిపట్టి, వ్యవసాయానికి అనుసంధానించింది కేసీఆర్ ప్రభుత్వం. గోదావరి నుంచి కృష్ణా, తుంగభద్ర వరకు ఏ నది నీటినీ నిరుపయోగంగా కిందకు వదలకుండా కాళేశ్వరం మొదలు తుమ్మిళ్ల దాకా ఏయే ప్రాజెక్టులు, ఎన్నెన్నో ఇక్కట్లను దాటి, వ్యయప్రయాసాలకు వోర్చి కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిందో మన కండ్లకు కనిపిస్తున్నాయి. ఎనిమిదేండ్లలో లక్షా 76 వేల కోట్లను ఒక్క సాగునీటి రంగం మీదనే ఖర్చు చేసి కోటిన్నర ఎకరాలకు సాగునీరు అందించిన సర్కార్ ఈ దేశంలో ఏదైనా ఉన్నదా? లక్షా 37 వేల కోట్లు ఖర్చు చేసి 7 వేల మెగావాట్ల నుంచి 19,464 మెగావాట్లకు స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచటమే కాదు, 6 లక్షల 87 వేల 500 కోట్ల ఆస్తులను విద్యుత్తు రంగంలో సృష్టించింది బీఆర్ఎస్ సర్కార్.

కల్లాల్లోనే రైతుల సంపద వడగండ్ల వానకు ఆగమైపోరాదనే దృఢసంకల్పంతో 4 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 24.73 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి నూతన గిడ్డంగులు నిర్మించటమే కాదు, లక్షా 35 వేల కోట్ల విలువ చేసే ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఆసరాగా నిలిచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. రైతుబంధు, బీమా ఇలా ఎన్నో మానవీయ పథకాల అమలేకాదు, అడుగడుగునా రైతులకు అన్నీ తానై వెంట నిలిచింది.

రేవంత్ సర్కార్ వచ్చిందే తడవుగా రాచి రంపా న పెట్టటానికి అన్నట్లు రైతుబంధుకు గండికొట్టి, నీటి ఇక్కట్లు, కరెంట్ కష్టాలకు తెరలేపింది. చివరికి పండించిన పంటనూ కొనకుండా రైతుల ఉసు రు పోసుకుంటున్నది. రైతు డిక్లరేషన్ పేరిట కాంగ్రె స్ ఇచ్చిన గ్యారెంటీలను గుర్తుచేసుకుంటే సీఎంతో ఏ బేతాళ మాంత్రికుడు కూడా తూగలేడు. ప్రతి మండలంలో అధునాతన మార్కెట్ యార్డ్ నిర్మాణంతో పాటు అనేక హామీలిచ్చి ఆదర్శ రైతు రాజ్యం తెస్తామని పాలకులు గొప్పలు చెప్పారు. కానీ రెండున్నరేండ్లలో పట్టించుకునే నాథుడే కరువై అనాథనైపోయాననే వేదనకు రైతు లోకాన్ని గురిచేశారు. ఎగ్గొట్టినా అసమర్థుడని తిట్టి వదిలేశారు. కానీ చివరికి రెక్కల కష్టాన్ని కూడా కొనకుండా వెక్కిరిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరును మాత్రం రైతాంగం జీర్ణించుకోలేకపోతున్నది. కండ్లెదుటే కల్లాలన్నీ అల్లకల్లోలంగా మారిపోతున్నాయి.

ఇప్పుడు ఏ ఊరి రైతును కదిలించినా కండ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. గ్యారెంటీలు ఎగ్గొట్టిందే కాకుండా, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినవన్నీ కూడా రేవంత్ సర్కార్ నిలిపేసింది. పైగా, వ్యవసాయ రంగంలో విధ్వంసక పాలనా నమూనాను అమలుపరుస్తున్నది. ఇలా ఒకవైపు రైతాంగాన్ని హింసిస్తూ, మరోవైపు ఈనెల 4 నుంచి రైతు వారోత్సవాల పేరిట అసత్యాల డంభాచారానికి ఒడిగట్టిన సర్కార్ గాయం మీద యాసిడ్ పోసినట్లుగా రైతులను ఎగతాళి చేస్తున్నది. అందుకే పొలాలకు పోయే తొవ్వల్లో ఏ ఇద్దరు రైతులు ఎదురుపడ్డా దిగులు పంచుకుంటున్నారు. మన సేద్యం కోసం సంగ్రామం తప్ప మరో మార్గం లేనేలేదు. దానికోసమే నేడు వరంగల్‌లో బీఆర్ఎస్ రైతు సంగ్రామ సదస్సుతో శంఖారావం పూరిస్తున్నది.

# ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా...?





**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి :**

పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తెనుగుపల్లి కి వచ్చే దారిలో డి 86/10 ఎల్ ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జి మీద ఇరువైపులా గోడ నిర్మించాలని తెనుగుపల్లె యువకులు పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు. తెనుగుపల్లికు చెందిన యువకుడు కలవేన మహేష్ మాట్లాడుతూ... ఎస్సీ కాలనీ నుండి తెనుగుపల్లికి వచ్చే దారిలో కాల్వపై ప్రమాదకరమైన మూలమలుపు ఉండడంతో ప్రమాదం పొంచి ఉందని ఇరువైపుల గోడ నిర్మించాలని దీని వలన రాత్రి సమయంలో వాహనదారులు అనేక ప్రమాదాలకు, ఇబ్బందులకు. గురవుతూ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రావాల్సి వస్తుందని అన్నారు.దీనిపై దృష్టి సారించాలని పలుమార్లు అధికారులకు పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రాణాలు పోతే గాని... దీనిని ఎవరు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కలవేన శ్రీకాంత్, రఘుపతి, వెంకటేష్, వంశి ,కోటేష్ ,సుంకరి దుర్గాప్రసాద్, మహేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# హామీల హడావిడి... పాలనలో ఖాళీ? తెలంగాణలో అభివృద్ధి దారి ఎటు?

**భవనాల నిర్మాణం మా?ప్రజల అభివృద్ధి**
**యువతకు ఉపాధి అవకాశాల లోటు**
**మంత్రివర్గంలో ఖాళీలు -- పాలనలో అయోమయం**
**గృహ హామీల అమలుపై అనుమానాలు**
**రైతుకు శాశ్వత పరిష్కారాల లోపం**
**ప్రైవేట్ ఉద్యోగుల దయనీయ పరిస్థితి**
**ప్రజాస్వామ్యంలో పారదర్శకత ప్రశ్నార్థకం**
**గంగవరం రామకృష్ణారెడ్డి**





**అగ్నిధార న్యూస్ వనపర్తి జిల్లా:**

తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ కాలంలో జిల్లాల విభజనతో కలెక్టరేట్లు, పోలీస్ సముదాయాలు, విలాసవంతమైన కార్యాలయ భవనాలు భారీగా నిర్మించబడ్డాయి. అభివృద్ధి పేరుతో జరిగిన ఈ నిర్మాణాలు ప్రజల జీవన ప్రమాణాలను ఎంతవరకు మెరుగుపరిచాయనే ప్రశ్న మాత్రం ఇంకా మిగిలి ఉంది.దకొత్త జిల్లాలు ఏర్పడినప్పటికీ, స్థానిక యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో విఫలం అయ్యారు. ఉద్యమ కాలంలో ఆశలు పెట్టుకున్న వేలాది గ్రాడ్యుయేట్లు నేడు నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్నారు. ఇదిలా ఉండగా, ఎన్నో గ్యారెంటీలు, హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా అమలులో వెనుకబడిందనే విమర్శలు ఎదుర్కొంటోంది. రెండు విద్యాసంవత్సరాలు గడిచినా పూర్తి స్థాయి విద్యామంత్రి లేకపోవడం, హోంశాఖలో కూడా పూర్తి స్థాయి నాయకత్వం లేకపోవడం పాలనా లోపాలను సూచిస్తున్నాయి. ఇల్లు లేని పేదలకు గృహాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు ఇంకా స్పష్టత దశలోనే ఉన్నాయి. ఆర్థిక సహాయం పరిమితంగా ఉండటం, అమలులో పారదర్శకతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో అమలైన పథకాలతో పోలిస్తే స్పష్టమైన విధానం కనిపించడం లేదు. రైతుల సమస్యలు కూడా అలాగే కొనసాగుతున్నాయి. రుణమాఫీ హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుబంధు, రైతు భరోసా పేర్లు మారినా, రైతుల ఆర్థిక స్థితిలో గణనీయమైన మార్పు కనిపించడం లేదు. తాత్కాలిక సహాయాల కంటే శాశ్వత పరిష్కారాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో బలమైన విధానాలు లేకుండా కేవలం భవనాల నిర్మాణం ద్వారా అభివృద్ధి సాధ్యం కాదు.

ప్రజాస్వామ్యంలో పారదర్శకత, బాధ్యతాయుత పాలన అత్యవసరం. పదవులు, విలాసాలు కాకుండా ప్రజల అవసరాలపై దృష్టి పెట్టినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. లేకపోతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుంది.

పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక ఉపాధి పెంపు
రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చే విధానాలు
ప్రైవేట్ ఉద్యోగులకు కనీస వేతన భద్రత
గృహ పథకాలలో పారదర్శకత

విద్య, వైద్యం రంగాల బలోపేతం వంటి ముందు చూపును ప్రభుత్వాలు పాటించాలి. భవనాలు కాదు, ప్రజల జీవన ప్రమాణాలే అసలు అభివృద్ధి ప్రమాణం.

ప్రజల్లో చైతన్యం పెరిగితేనే పాలనలో నిజమైన మార్పు వస్తుంది.

# ఏపీఎం అక్రమాలపై విచారణ జరపాలి

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

ఏపిఎం అక్రమాలపై విచారణ చేపట్టాలని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు దిడ్డికాడిగోపాల్, మాజీ సర్పంచ్ వెంకట్ రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ .. ఏపిఎం వివో ఏలపై వేధింపులకు పాల్పడుతోందని అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కమీషన్ విషయంలో అక్రమాలు జరిగాయని అవి బయటకు రాకుండా ఉండేందుకు డబ్బులు ముట్ట చెప్పాలని వేధింపులకు పాల్పడుతున్నారు. దీంతో చేసేదేమీ లేక వివోఏలు కొంత మొత్తం జమ చేసి రూ.50 వేలు వివో ఏల మండల అధ్యక్షుడు వెంకట్ రాములు ఫోన్ పే ద్వారా ఏపీఎంకు డబ్బులు పంపించాని అప్పి డబ్బులు వెంటనే తిరిగి పంపించి, ఆన్లైన్ వద్దు నగదు కావాలని నగదు తీసుకుందని అన్నారు. ఇంకా కావాలని వేధిస్తుండడంతో వివో ఏలు మూడు రోజుల క్రితం డి ఆర్ డి ఏ పిడికి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఏపీ ఎం పై ఎలాంటి విచారణ చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కింది స్థాయి సిబ్బంది తప్పు చేసినట్లయితే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, కానీ నువ్వు వారిని వేధింపులకు గురి చేసి డబ్బులు తీసుకుని మరిన్ని డబ్బులు కావాలని బెదిరించడం ఏంటని వారు ఆరోపించారు. అలాగే ఏపీఎం కాంగ్రెస్ నాయకుల కారులల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయడానికి వెళ్లి అధికార పార్టీ నాయకురాలు లా వ్యవహరించిందని అధికార పార్టీ నాయకుల అండతో ఇలా కింది సాయి సిబ్బందిని వేధింపులకు గురి చేయడం తాను అవినీతికి పాల్పడి వివోఏలను డబ్బులు డిమాండ్ చేయడం ఎంతవరకు సమంజసం అని వెంటనే ఉన్నత అధికారులు ఆమెపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, సూర్య నాయక్, రామ్ రెడ్డి,మాజీ సర్పంచులు బెస్త రాజేశ్వర్ రవీందర్ నాయక్, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బీరప్ప స్వామి విగ్రహ ధ్వజ స్తంభ ప్రతిష్ట..



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రంలో కురుమల కుల దైవం బీరప్ప స్వామి కామరాతి. అక్క మహంకాళి విగ్రహ ప్రతిష్ట. ధ్వజస్తంభ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు బుధవారం. వేకువ జాము నుండి వేదమంత్రాల నడుమ ప్రతిష్టాపన కార్యక్రమలను ద్విగ్విజయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో. ధ్వజస్తంభ దాత మాజీ ఎం.పీ.టీ.సీ సభ్యులు నెంట. లలిత తంబాలు. ఆలయ కమిటీ సభ్యులు. చిందం కృష్ణయ్య కురుమ. నెంట జంగయ్య. రాములు. సత్యనారాయణ. బడుక. రామకృష్ణ. సూద. కుమార్. కించ.కుమార్. కృష్ణ. ప్యాట. శ్రీశైలం. నెంట. పర్వతాలు. బడుక. బీరయ్య. బడుక. వెంకటయ్య. వెంకటయ్య. నెంట.భాస్కర్. గౌర రమేష్. నెంట.శివ సూద. సత్యనారాయణ. సూద. లక్ష్మయ్య. మల్లయ్య. నెంట వినయ్. యాదయ్య. కారువంగా వెంకటయ్య. కారువంగా పర్వతాలు. శివ. భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలోని కుందారం తండా గ్రామ పంచాయతీ లాలు తండా కు చెందిన కొర్ర బాలు అనారోగ్యంతో మరణించడం జరిగింది. స్థానిక సర్పంచ్ సిద్ధ గొని రమేష్ గౌడ్ ద్వారా తెలుసుకున్న ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పల వెంకటేష్ వారి కుటుంబ సభ్యులకు 3000 రూపాయలు అందచేయడం జరిగింది ఈ కార్యక్రమంలో, వారి తరుపున లక్ పతి, వెంకటేశ్, నాను, శ్రీనివాస్ ,ఈశ్వర్, ఆర్ రవి, చరణ్, ఎ రవి , నందు, తదితరులు పాల్గొనడం జరిగింది.

## పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించాలని సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం ఉదయం పెంచిన వంట గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశు రాములు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముందు చూపు లేక పోవడం ద్వారా రాష్ట్రంలో ఏర్పడ్డ వంట గ్యాస్ డీజీలు పెట్రోల్ కొరతను తక్షణమే నివారించకపోతే ప్రజా ఉద్యమం తప్పదని అన్నారు. ఎన్డీఏ అధికారంలోకి రాక ముందు 450 రూపాయలు ఉన్న సిలిండర్ ధర నేడు 900 వందల రూపాయలు పెరిగింది. కమర్షియల్ సిలిండర్ ధరలైతే ఆకాశాన్ని తాకేలా పెరిగాయని అన్నారు. పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మండల తహసిల్దార్ ఇబ్రహీం కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు గంజి శివుడు, శివరాం. వానరాశి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



**అగ్ని ధార న్యూస్ మహమ్మదాబాద్:**

మహబూబ్ నగర్ జిల్లా కొంరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులు బద్దుల కేశవులు (ఇరిగేషన్ డిపార్ట్ మెంట్ వర్కింగ్ ఇన్స్పెక్టర్) జన్మదినం సందర్భంగా నంచర్ల గేట్ దగ్గర కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది కార్యక్రమంలో ఉమ్మడి గండీడ్ మండల మాజీ జడ్పీటీసీ జంగాల్ల వెంకటయ్య,మహమ్మదాబాద్ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు రుద్రారం మహేందర్, మహమ్మదాబాద్ మండల టి ఆర్.ఎస్ యూత్ అధ్యక్షులు తలారి రంగయ్య, పగిడ్యాల్ ఆగేర్ల కృష్ణయ్య కండక్టర్,ఉమ్మడి పాలమూరు జిల్లా అంబేద్కర్ సంఘం అధ్యక్షులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, సి.ఆర్.పి, వెంకట్ గౌడ్, మహబూబ్ నగర్ వెంకటయ్య,గండీడ్ మండల సిటిజన్ విజిలెన్స్ మానిటర్ కమిటీ అధ్యక్షులు రంగారెడ్డిపల్లి వివేకానంద్ , ముకర్లాబాద్ శ్రీకర్,శంకర్, వెంకట్ రాములు, జి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ బలోపేతం చేయాలి

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు**
**ఐ టి ఇ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం..**
**పాల్గొన్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**





అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

పెద్దపల్లి జిల్లా మంథనిలో తెలంగాణ ప్రభుత్వం ఐటిఈ శాఖ ఆధ్వర్యంలో టాస్క్ మరియు కంట్రోల్ ఎస్ డేటా సెంటర్స్ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఘనంగా ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా. ఐటీ,పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్థానిక ఎంపి గడ్డం వంశీ కృష్ణ జిల్లా కలెక్టర్ కోయ హర్ష మరియు టాస్క్ సి.ఇ.ఓ నితిన్ కుమార్ రెడ్డి టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్‌ను మరింత బలోపేతం చేసి, యువతను భవిష్యత్ టెక్నాలజీలకు సిద్ధం చేయాలనే దిశగా ఈ కేంద్రం ఏర్పాటు చేయబడిందని,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రాన్ని స్కిల్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుండగాఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క యువతకు ఉపాధి,స్వయం ఉపాధి అవకాశాలు పెంచేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు,ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ,సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా యువతకు ఇండస్ట్రీకి అనుగుణమైన స్కిల్ ఆధారిత శిక్షణ,ఆధునిక ప్రాక్టీస్ టెక్నాలజీ ట్రైనింగ్,రియల్ టైమ్ ప్రాజెక్టులపై పని చేసే అవకాశాలు, ప్రముఖ సంస్థలతో కలసి ప్లేస్మెంట్ సపోర్ట్,డేటా సెంటర్ టెక్నాలజీలపై ప్రత్యేక అవగాహన అందు బాటులోకి రానున్నాయని, టాస్క్ మరియు కంట్రోల్ ఎస్ సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ కేంద్రం విద్యార్థులు మరియు నిరుద్యోగ యువతకు శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలకు వేదికగా మారనుందనీ,ముఖ్యంగా మారుతున్న టెక్నాలజీ అవసరాలకు అనుగుణంగ యువతను తీర్చిదిద్దడంలో ఈ సి ఓ ఈ కీలక పాత్ర పోషించనుంది అని,ప్రస్తుతం ప్రపంచం వేగంగా మరియు ఆధునిక టెక్నాలజీల వైపు దూసుకెళ్తోంది,ఇలాంటి సమయంలో యువతకు సరైన నైపుణ్యాలు అందించడం అత్యంత అవసరం,టాస్క్ ద్వారా అందిస్తున్న ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ యువతకు ప్రాక్టికల్ నాలెడ్జ్, ఇండస్ట్రీ అనుభవం అందించి, వారిని ఉద్యోగాలకు సిద్ధం చేస్తుంది. గ్రామీణ ప్రాంతాల యువత ఈ గొప్ప అవకాశాలను వినియోగించుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షిస్తున్నానని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రదినిధుల, నాయకులతో పాటు, టాస్క్ సభ్యులు బృందం తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



అగ్నిధారన్యూస్ కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణ కేంద్రంలో మే 11,12,13 తేదీలలో జరిగే అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఎ.ఐ.యు.కె.ఎస్) జాతీయ ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్,ఎఐ.యు.కె.ఎస్. వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మైదం పాణి లు పిలుపునిచ్చారు. బుధవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ పడమరకోట ఛమాన్ సెంటర్ లో అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ ప్రథమ మహాసభల"వాల్ పోస్టర్స్" ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా తీగల జీవన్ గౌడ్, మైదం పాణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వ్యవసాయ రంగంలో రైతు వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం ఆరుగాలం కష్టపడి, అనేక కష్టనష్టాలకు ఓర్చుకొని తీరా పంట పండించి మార్కెట్లకు తీసుకువస్తే మార్కెట్ కేంద్రాలలో వరి, మొక్కజొన్న, మిర్చి, పత్తి, పసుపు లాంటి పంటలను నెలల తరబడి కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం, మధ్య దళారుల దోపిడీ, అకాల వర్షాల వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర,

రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రైతు పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, వ్యవసాయ రంగంలో స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దేశ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇల్లందులో జరిగే అఖిలభారత ప్రథమ మహాసభలలో వివరంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించబోతుందని తెలిపారు. మే 11న ఇల్లందులో 25వేల మంది రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందని, రెండవ, మూడవ రోజు 16 రాష్ట్రాల నుండి హాజరైన రైతు సంఘం ప్రతినిధులతో మహాసభ కొనసాగుతుందని, ఈ మహాసభలకు రైతు, కూలీలతో పాటు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాస్వామికవాదులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు బెల్లంకొండ కర్ణాకర్, సుధాకర్, ఇస్సాక్, సాల్మన్, చింత యోగు, కట్టమల్లు, నరసయ్య, సోమయ్య, కొత్తపల్లి మురళి,పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వస్తావా.. నీ రేటెంత..?

**హైదరాబాద్ లో ఆకతాయిల బారినపడ్డ లేడీ ఐపీఎస్ !**
**వివాదంగా లేడీ సింగం నైట్ స్టోరీ**





**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో రాత్రి 11 గంటలు దాటితే చాలు ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో బస్టాండ్ ల వద్ద, మెట్రో స్టేషన్ల వద్ద ఒంటరిగా అమ్మాయి కనిపిస్తే చాలు, గద్దల్లా వాలిపోతారు. బైక్స్ పై అమ్మాయి సమీపంలో రౌండ్లు కొడుతూ, కొద్దిసేపు గమనించి, వెంటనే దగ్గరకు వచ్చేస్తారు. వస్తావా మాతో, నీ రేటెంత అంటూ ప్రశ్నల వర్షం కురిపించి వేధింపులకు పాల్పడుతుంటారు. నెమ్మదిగా బేరాలు మొదలెడతారు. ఇలా నగర వ్యాప్తంగా అనేక ప్రాంతాల వద్ద ఇదే తంతు. తాజాగా ఇలాంటి ఆకతాయిలపై దృష్టిపెట్టి, వార్తల్లో నిలిచారు లేడీ సింగం, మల్కాజ్ గిరి నూతన పోలీస్ కమిషనర్ సుమతిమల్కాజిగిరి సీపీగా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజే, టార్గెట్ ఆకతాయిలు అంటూ రంగంలోకి దిగారు. అర్ధరాత్రి 12 గంటలకు దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్ వద్దకు సివిల్ డ్రస్ చేరుకున్న పోలీస్ కమిషనర్ సమతి. రోడ్డుప్రక్కన సాధారణ మహిళలా నిల్చున్నారు. అటుగా వెళుతున్న ఆగతాయిలు, ఆమెను గమనించడం మొదలు పెట్టారు. అలా కొద్దిసేపటికే ఒక్కొక్కరుగా ఆమె చుట్టూ చేరుకున్నారు. హాలో వస్తావా.. నీ రేటెంత .. అంటూ అడగటం మొదలుపెట్టారు. అలా అర్ధరాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 3.30 గంటల వరకూ సుమారు మూడున్నర గంటలపాటు లేడీ ఐపీఎస్‌ను కొందరు పోకిరీలు తమ మాటలతో వేధించారు. రోడ్డుపై నడుకుంటూ వెళుతున్న ఆమెను బైక్ లతో అడ్డుప డుతూ, ఈ రాత్రికి వస్తావా.. అంటూ బేరాలు మొదలెట్టారు. అలా ఆకతాయిల వేధింపులు భరిస్తూ , అక్కడున్న పరిస్థితులను స్వయంగా గమనిస్తూ రోడ్డుపక్కన గంటలపాటు నిల్చుని రాత్రివేళల్లో మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా పరిశీలించారు మల్కాజిగిరి సీపీ సుమతి. మూడున్నర గంటలుగా అటువైపు ఏ ఒక్క పోలీసు కానిస్టేబుల్ రాలేదు.

## వధూవరులను ఆశీర్వదించిన వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి



అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట గ్రామానికి చెందిన వివాహ వేడుకలో మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ మాజీ అధ్యక్షులు ద్యాప నిఖిల్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.వారి వెంట మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు రమేష్ నాయక్, ఉప సర్పంచుల సంఘం అధ్యక్షులు పోలె రాజు యువజన విభాగం మండల అధ్యక్షులు గుంజ ఆదినారాయణ, నర్సంపల్లి సర్పంచ్ శైలజ శ్రీశైలం జిల్లా, నాయకులు అబ్దుల్ సమి, మనోహర్ రెడ్డి ఉన్నారు

## కమాన్ పూర్ సింగిల్ విండో చైర్మన్ గా బాధ్యతలుస్వీకరించిన భాస్కర్ రావు..!




అగ్నిధార న్యూస్ కమన్పూర్

కమాన్ పూర్ సింగిల్ విండో చైర్మన్ గా ఇనగంటి భాస్కర్ రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్ చైర్మన్ చిందం తిరుపతి, డైరెక్టర్లుగా ఆడువాల చంద్రయ్య, గుండేటి శ్రీమూర్తి, వరాల నర్సింగం, ఊదరి నరేష్, ముస్కుల వీరలక్ష్మి, జనగామ తార లు కూడా బాధ్యతలు స్వీకరించారు. గత సంవత్సరం 19 న సింగిల్ విండో పాలక వర్గాలను రద్దు చేసి పర్సన్ ఇంచార్జను నియమించింది. సింగిల్ విండో పాలక వర్గాలకు ప్రభుత్వం పొడిగింపు గడువు ముగియక ముందే రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో తిరిగి పాత పాలక వర్గాలకు బాధ్యతలు అప్పగించాలని కోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు పాత సింగిల్ విండో చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు సీ. ఈ. వో తిమ్మరాజు సంతోష్ కుమార్ సమక్షంలో రిజిస్టర్ లో సంతకాలు చేసి బాధ్యతలు చేపట్టారు. రబీ సీజన్ లో రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేయడం జరుతుందన్నారు. అనంతరం చైర్మన్ బాస్కర్ రావు,వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లకు సింగిల్ విండో కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది శాలువాలు కప్పి ఆత్మీయ సత్కారం చేశారు.

## మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన ఆదివరాహస్వామి పాలక వర్గం..!



అగ్నిధార న్యూస్ కమాన్ పూర్

పెద్దపల్లి పట్టణంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు దుద్దిలళ్ల శ్రీధర్ బాబు ను బుధవారం కమాన్ పూర్ ఆదివరాహస్వామి ఆలయ నూతన పాలక వర్గం చైర్మన్ ముస్త్యాల దామోదర్, డైరెక్టర్లు బూస శ్రీనివాస్, తీగల రాజయ్య, మల్యాల మల్లేష్, చాట్ల రాయమల్లు, కొంతం శ్రీనివాస్ లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి ఆత్మీయ సత్కారం చేశారు.

## ఆది వరహా ఆలయ కమిటీ సమావేశం



అగ్నిధార న్యూస్ కమన్పూర్

శ్రీ ఆది వరహా స్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీ ముత్యాల దామోదర్ దేవస్థాన కార్యనిర్వనాధికారి అధ్యక్షతన ఆలయ కమిటీ సమావేశం బుధవారం ఉదయం నిర్వహించడం జరిగింది దేవాలయ వచ్చే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం సాయంకాలం ఐదు నుంచి ఏడు గంటల వరకు తీసి ఉంచబడును మరియు దేవాలయం వద్ద అన్నదానం చేయుట కొరకు దేవాలయ నిధులచే టిన్ రేకుల షెడ్డు వేయటం కొరకు మరియు దేవాలయము కమాన్పూరు రోడ్డు సిసి వేయించుట కొరకు ఇతర అభివృద్ధి పనులకు గాను స్థానిక మంత్రివర్యులను కలవాలని నిర్ణయించుకున్నారు దేవాలయముకు భక్తులు ఇచ్చు విరాళాలకు తగిన రసీదు పొందగలరని మీ ద్వారా తెలియజేస్తున్నాను ఆలయ సిబ్బంది తగిన రసీదు ఇవ్వనిచో ఫిర్యాదు చేసినచో వారిపై చర్యలు తీసుకోబడును అని తెలిపినారు

# నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా





**రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ ద వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు.**
**యువత నైపుణ్యాభివృద్ధి ద్వారానే ఉపాధి సాధ్యం.**
**మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు -- 4 వేల ఉద్యోగ అవకాశాలు.**
**పెద్దపల్లిలో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు.**
**ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు.**
**ఎంపీ వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మే-06:**

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల దిశగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు.

బుధవారం పెద్దపల్లి పట్టణంలోని వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాల సృష్టిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నాలెడ్జ్ సెంటర్లు ఉండగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా పెద్దపల్లిలో టాస్క్ రీజినల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో టాస్క్ ద్వారా శిక్షణ పొందిన అనేక మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందగా, 261 మంది ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీల్లో ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు.నైపుణ్యాలు ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని, మంత్రి, ఎమ్మెల్యేల పట్ల గౌరవం ఉన్నప్పటికీ యువతకు తగిన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు రావని స్పష్టం చేశారు. ఇంజినీరింగ్, ఎంసీఏ, ఎంఏ మ్యాథ్స్, ఎంఏ ఫిజిక్స్ వంటి విద్యార్హతలు ఉన్నా పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు లేకపోతే ఉద్యోగాలు సాధ్యం కాదని యువత గుర్తుంచుకోవాలని సూచించారు. మెగా జాబ్ మేళాలో 77 కంపెనీలు పాల్గొని 4 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ముందుకు వచ్చాయని, అయితే 1500 మంది మాత్రమే షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. గోల్డ్ మెడలిస్ట్‌లు అయినా సరే సాఫ్ట్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ లేకపోతే పరిశ్రమలకు పనికిరావని పేర్కొన్నారు. యువతకు తగిన నైపుణ్యాలు కల్పించేందుకు స్కిల్ యూనివర్సిటీ, ఏటీసీ సెంటర్లు, టాస్క్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు పేర్కొంటూ, ప్రైవేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు పెంచేందుకు భారీ పెట్టుబడులను తీసుకువస్తున్నామని తెలిపారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలనుకునే పెద్దపల్లి యువతకు స్కిల్ యూనివర్సిటీలో అవకాశాలు కల్పించి ఉపాధి కల్పించడం తన బాధ్యత అని మంత్రి హామీ ఇచ్చారు.తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ దేశంలోనే ప్రత్యేకమైన వేదికగా ఉందని, ఇందులో నమోదు చేసుకుంటే అభ్యర్థుల నైపుణ్యాలను విశ్లేషించి తగిన పరిశ్రమలలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా వ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ వేదికలో నమోదు కావాలని సూచించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్ పరీక్షలను సక్రమంగా నిర్వహించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. యువత నూతన సాంకేతికతలను ఆచరించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచిస్తూ, యువత సంక్షేమం కోసం ప్రతి నిమిషం పనిచేసే ప్రభుత్వం ఇదేనని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ ఏర్పడిన తర్వాత నిరుద్యోగ సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చినా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సుమారు ఒక లక్ష ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు జరుగుతున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని పేర్కొన్నారు. విద్య, పరిశ్రమల అవసరాలు, ఉద్యోగ నైపుణ్యాల మధ్య సరిపోలిక సాధించేందుకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, టాస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రాల్లో ఉన్నత ప్రమాణాలు పాటిస్తున్నామని, ప్రతి విద్యార్థి, నిరుద్యోగ యువత ప్రభుత్వం అందిస్తున్న టాస్క్, ఏటీసీ వంటి వనరులను సద్వినియోగం చేసుకుని మంచి వేతనంతో కూడిన ఉద్యోగాలను సాధించాలన్నారు.ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ, రెండు సంవత్సరాల క్రితం పెద్దపల్లిలో టాస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టాస్క్ ద్వారా శిక్షణ పొందిన 261 మంది యువత ప్రస్తుతం ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీల్లో అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందారని చెప్పారు. అలాగే పెద్దపల్లిలో వీ-హబ్ ను ఏర్పాటు చేసి, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేడు పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళాను పరిశ్రమల శాఖ, టాస్క్ సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. 77 కంపెనీల వరకు మెగా జాబ్ మేళాలో రిజిస్టర్ కావడం జరిగిందని, ఐటీ, బిపిఓ, మార్కెటింగ్, ఉత్పత్తి రంగం వంటి వివిధ రంగాలలోని కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

నేడు జరిగిన జాబ్ మేళా కార్యక్రమంలో 1200 మంది విద్యార్థులు షార్ట్ లిస్ట్ కావడం జరిగిందని, 647 మల్లీ యువతకు అపాయింట్మెంట్ ఆర్డర్లు సిద్ధం చేశామని అన్నారు.

అగ్ని వీర్, పోలీస్ ఉద్యోగుల ఎంపికలో ఆసక్తిగల నిరుద్యోగ యువతకు పెద్దపల్లి జిల్లాలో ప్రత్యేకంగా అవసరమైన శిక్షణ కార్యక్రమాలను అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మెగా జాబ్ మేళాను సమర్థవంతంగా నిర్వహించడంలో సహకరించిన డీఈఈటి, టాస్క్, ఐటీ శాఖ అధికారులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, కొంతమంది ఆత్మహత్యలకు కూడా పాల్పడిన పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. యువత సంక్షేమంతోనే "తెలంగాణ రైజింగ్" సాధ్యమవుతుందని, యువతకు మంచి భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సమయంలో కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదని, బీఆర్ఎస్ కూడా అనేక హామీలు ఇచ్చినా అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం, మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అనేక కంపెనీలను తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రామగుండం ప్రాంతంలో సుమారు 30 వేల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అక్కడ కూడా మెగా జాబ్ మేళాను నిర్వహించాలని మంత్రి గారిని కోరారు. సింగరేణి, ఎన్‌టీపీసీ వంటి సంస్థలు, ప్రభుత్వం కలిసి రామగుండంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్య గౌడ్, రామగుండం మేయర్ మహంకాళి స్వామి,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేణిగుంట శాఖా గ్రంధాలయం నందు వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**రేణిగుంట :** రేణిగుంటలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. రేణిగుంట శాఖ గ్రంథాలయం నందు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల సందర్శించినచైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి తో పాటు ముఖ్య అతిథులు గా పాల్గొని ప్రసంగించారు . చైర్మన్ గురువారెడ్డి మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులు కూటమీ ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రివర్యులు లోకేష్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నాం అన్నారు ఈ శిబిరాల ద్వారావిద్యార్థులకు పుస్తక పఠనం నాయకత్వ లక్షణాలు మంచి ఉపన్యాసకులుగా తీర్చిదిద్దడం కథలు చెప్పడం, , యోగ, స్పోకెన్ ఇంగ్లీష్, జనరల్ నాలెడ్జ్ డ్రాయింగ్ పరిసరాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలో విధానాన్ని కంప్యూటర్ పరిజ్ఞానం యోగా ధ్యానం తదితర అంశాలను నేర్పిస్తామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు శిబిరం కూటమి ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసింది అన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించు కొని వారి సృజనాత్మకతను వెలికి తీయాలని లక్ష్యముతో మీ మేధాశక్తిని పెంచే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది అన్నారు ఈ యొక్క శిబిరాలను విద్యార్థులు 5వ తరగతి నుండి పదవ తరగతి వరకు ఉన్నవారు వినియోగించుకొని తమ యొక్క నైపుణ్యాన్ని పెంచుకోవాలని చైర్మన్ పిలుపునిచ్చారు గ్రంథాలయాల అనేటివి సరస్వతి దేవి నిలయాలు మీకు విజ్ఞానాన్ని పెంపొందించే జ్ఞానబండాగారాలు అన్నారు గత ప్రభుత్వాలు రాజకీయ నాయకులను విదేశాలకు పంపింది చూసాం మరి ఈరోజు విద్యా మంత్రినారా లోకేష్ విదేశాల్లో విద్యా వ్యవస్థ పై అధ్యయనం చేయడం కోసం ఉపాధ్యాయులను ఒక బృందం గా ఏర్పాటు చేసి విదేశాలకు పంపి అక్కడ ఉన్నటువంటి విద్యా వ్యవస్థను వారు అధ్యయనం చేసి అక్కడ ఉన్నటువంటి ఆలోచనలను తీసుకొచ్చి మీకు నేర్పించే విధంగా నిర్ణయం తీసుకొని వారు ఉపాధ్యాయుని పంపడం వారికి విద్య లయాలపై ఉన్నటువంటి ఆలోచన అదే విధంగా మెరుగైనటువంటి విద్యను ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థులకు నేర్పించాలని లక్ష్యంతో పనిచేస్తున్న మంత్రివర్యులు నారా లోకేష్ అనే విషయాన్ని మీకు తెలియపరుస్తున్నామన్నారు దానికి నిదర్శనమే ఈ సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో మంచి మార్కులు ఉత్తీర్ణత సాధించడం నిదర్శనం అన్నారు గ్రంథాలయాల ద్వారా కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కి ప్రిపేర్ అయి ఎందరో ఐఏఎస్ నుండి టీచర్ వరకు ఉద్యోగ అవకాశాలు పొందారు అటువంటి గ్రంథాలయాలని మీరు కూడా విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం వైపు మొగ్గుచూపి క్రమశిక్షణతో సమాజంలో మంచి పౌరులుగా తీర్చిదిద్దబడాల అనే ఆశయంతో ఈ వేసవిజ్ఞాన శిబిరాలను కూటమిప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేయడం జరిగింది అదేవిధంగా రేణిగుంట్ల గ్రంథాలయాన్ని స్థానిక నాయకులు మరియు శాసనసభ్యుల సహకారంతో పాఠకులకు ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేస్తాం అని గురువారెడ్డి అన్నారు. సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్చార్జ్ సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను పాఠకులకు అనుకూలంగా తీసుకువచ్చి బాగా అభివృద్ధి చేయాలని యొక్క వేసవి విజ్ఞాన శిబిరాలని విద్యార్థులు వాడుకోవాలని కోరారు క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాథ్ ఈ యొక్క వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రభుత్వం మంచి ఆలోచనతో ఏర్పాటు చేయడం జరిగింది అటువంటి శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకుని మంచి పౌరులుగా తీర్చిదిద్దబడాలని ఆశిస్తున్నామన్నారు అదేవిధంగా గ్రంధాలయా భవనం పై కప్పు పాడయినందువల్ల రిపేరు చేయాలని కోరారు పట్టణ పార్టీ అధ్యక్షుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం సదుద్దేశంతో ఈ యొక్క వేసవిలో పిల్లలకు ఈ కార్యక్రమం తీసుకురావడానికి స్వాగతిస్తున్నాం ఆ విధంగా విద్యార్థులంతా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు విద్యార్థులు చేస్తున్న యోగ కార్యక్రమం నాయకులతో కలిసి చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి తిలకించారు



## హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌లో రాజేందర్‌కు అదనపు బాధ్యతలు



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి):**

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా సంస్థలో పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కొండల రాజేందర్ కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఇన్‌చార్జిగా సంస్థ ఉన్నతాధికారులు నియమించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధనలో మరింత నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. పేదల సమస్యల పరిష్కారం, అన్యాయానికి గురైన వారికి న్యాయం కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మానవ హక్కులపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధితులకు సహాయం అందించడం, సంస్థను బలోపేతం చేయడం లక్ష్యమని చెప్పారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సంబంధిత జిల్లాల నాయకులు, సభ్యులు సమన్వయంతో పనిచేసి సంస్థ ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు.

## రైతుల కష్టాల పట్టడం లేదు

**వరంగల్ :** వరంగల్ వేదికగా జరిగిన 'రైతు సంగ్రామ సదస్సు'లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. వరంగల్ జిల్లా కాకతీయ పౌరుషాల గడ్డ అని కొనియాడిన కేటీఆర్, ఇక్కడి నుంచే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని ప్రకటించారు. నాలుగేళ్ల క్రితం వరంగల్‌లో కాంగ్రెస్ ప్రకటించిన 'రైతు డిక్లరేషన్' ఒక నయవంచన అని, అది కేవలం ఓట్ల కోసమే చేసిన 'కొంగజపం' అని ఆయన మండిపడ్డారు. డిక్లరేషన్‌లో ఇచ్చిన 34 హామీలను గాలికొదిలేశారని, వంద రోజుల్లోనే నెరవేరుస్తామని చెప్పి నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓట్లు వేసిన రైతులు నేడు అరిగోస పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు డిక్లరేషన్‌ను ఒక బోగస్ చిత్తు కాగితంగా అభివర్ణించిన కేటీఆర్... ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు మేళాలను 'దగా మేళాలు'గా సంబోధించారు. కేసీఆర్ హయాంలో ఎకరాకు రూ. 10 వేలు అందిస్తే, రూ. 15 వేలు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్.. నేడు కనీసం ఉన్న సౌకర్యాలను కూడా అందించలేకపోతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికి 69 సార్లు ఢిల్లీకి వెళ్లారని, కానీ రాష్ట్ర రైతు ప్రయోజనాల కోసం ఒక్క పైసా కూడా తీసుకురాలేదని ఆక్షేపించారు. రైతుల సహనాన్ని పరీక్షించవద్దని, వడ్ల కొనుగోళ్లలో జాప్యం జరిగితే కాంగ్రెస్ నేతలను గ్రామాల్లో రైతులు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

## క్రిషాంక్ కు బెయిల్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాల నేపథ్యంలో నమోదైన కేసుల్లో ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. కేసు వివరాల్లోకి వెళితే... కూకట్‌పల్లిలో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజేంద్ర కుమార్ నివాసం వద్ద గొడవ పడ్డారనే ఆరోపణలపై పోలీసులు క్రిశాంక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి అదనంగా, 2024లో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక పాత కేసులో కూడా పోలీసులు పీటీ వారెంట్ జారీ చేసి ఆయనను మేడ్చల్ కోర్టులో హాజరుపరిచారు. ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టడం, అధికారులను దూషించడం వంటి అంశాలపై ఈ కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్, వీటిపై బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.హైకోర్టులో విచారణ సందర్భంగా, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే సెలవు రోజుల్లో కూడా పీటీ వారెంట్లు జారీ చేస్తూ తనను వేధిస్తున్నారని క్రిశాంక్ తరపు న్యాయవాదులు వాదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ, నిబంధనల మేరకు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలులో జరిగిన అవకతవకలు, మంత్రులపై తాను చేసిన విమర్శల కారణంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని క్రిశాంక్ ఈ సందర్భంగా ఆరోపించారు.

## చింతల్ లో సంచలనంగా మర్డర్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హత్య సంచలనంగా మారింది. హత్య జరిగిన తీరు తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని అత్యంత కిరాతకంగా నిద్రలోనే పరలోకానికి పంపేశారు తల్లీ,కొడుకులు. శవాన్ని మాయం చేసే క్రమంలో ఇంటి ఓనర్‌కు అనుమానం రావడంతో పోలీసులకు చిక్కారు. దీంతో మొత్తం మర్డర్ స్కెచ్ బయటపడింది.చింతల్ అంబేద్కర్ నగర్‌లో శివారెడ్డి అనే వ్యక్తితో పదేళ్ల క్రితం గార్లపల్లి అరుణకు పరిచయం ఏర్పడింది. బాలానగర్‌లోని సూర్య ఇంజనీరింగ్ వర్క్స్‌లో ఇద్దరూ పని చేస్తుండగా ఏర్పడిన పరిచయం కాస్తా, సహజీవనం వరకూ వెళ్లింది. గత పదేళ్లుగా ఇద్దరూ కలిసే ఉంటున్నారు. శివారెడ్డితో పరిచయానికి ముందే అరుణకు, సాయిరత్నం అనే కొడుకున్నాడు. తల్లి,కొడుకూ వాళ్లు ఉంటున్న ఇంట్లోనే శివారెడ్డికి ఆశ్రయం కల్పించారు. అలా బాలానగర్ సమీపంలో ఒకే ఇంట్లో ఉంటున్న ముగ్గురూ ఇటీవల చింతల్ అంబేద్కర్ నగర్‌కు ఇల్లు మారారు.రోజూ మద్యం సేవించే అలవాటున్న శివారెడ్డి , తప్పతాగి ఇంటికొచ్చి అరుణను , ఆమె కుమారుడు సాయిరత్నాన్ని విపరీతంగా వేధించేవాడు. మానసికంగా , శారీరకంగా చిత్రహింసలకు గురిచేసేవాడు. అలా శివారెడ్డి వేధింపులు భరించలేని తల్లి, కొడుకులూ కలసి శివారెడ్డిని హతమార్చేందుకు ప్లాన్ చేశారు. హత్య చేయాలనుకున్న నాటి నుంచి పక్కా ప్లాన్‌తో ముందుకెళ్లారు తల్లీ , కొడుకులు . ముందుగా యూట్యూబ్ వీడియోలను చూసిన కొడుకు సాయిరత్నం, శివారెడ్డిని ఎలా చంపాలనేది ప్లాన్ చేశాడు. యూట్యూబ్ వీడియోల తల్లికి చూపించిన హత్యకు ప్లాన్ చెప్పాడు. గూగుల్ సహాయంతో కత్తి ఎక్కడ కొనాలి, హత్య తరువాత ఎలా తప్పించుకోవాలనేది రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసుకున్నారు. అనుకున్నది అనుకున్నట్లుగా అమలు చేసేందుకు ఈనెల 3వ తేది అర్థరాత్రి దాటిన తరువాత, రోజూ మాదిరి తప్పతాగి ఇంటికొచ్చిన శివారెడ్డికి ఏమాత్రం అనుమానం రాకుండా , భోజనం పెట్టి పడుకోబెట్టారు. గాఢ నిద్రలో ఉన్న సమయంలో అప్పటికే కొనుగోలు చేసిన మటన్ కత్తితో, ఒకరు పట్టుకోగా, మరొకరు అత్యంత కిరాతకంగా గొంతు కోశారు. శివారెడ్డి ప్రాణాలు కోల్పోయాడని నిర్ధారించుకున్న తరువాత శవాన్ని సంచిలో మూటకట్టి, తరలించే క్రమంలో స్థానికులకు, ఇంటి యజమానికి అనుమానం రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు, మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్టు తరువాత నిందితులను తమ స్టైల్‌లో విచారించగా వాస్తవాలు వెలుగుచూశాయి.

# హీరోల యాటిట్యూడ్‌పై వ్యాఖ్యలు.. అల్లు అర్జున్‌ని కాదంటూ రవిబాబు క్లారిటీ



ఝజఱ ధీఝఎబ । తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు రవిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. కథ ఏదైనా సరే దానికి వినూత్న ట్రీట్‌మెంట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా తన ముద్ర వేసిన రవిబాబు.. తాజాగా 'రేజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రేజర్ మే 8న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్లలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ, "ఒక్క హిట్ వచ్చినా హీరోల బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది. కళ్లజోడు పెట్టుకుని బిల్డప్పులు కొడతారు" అని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యలు నేరుగా అల్లు అర్జున్‌ని ఉద్దేశించి చేసినవేనని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్తో భారీ క్రేజ్ సంపాదించిన అల్లు అర్జున్ ప్రవర్తనను ఉద్దేశించారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన రవిబాబు, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.నేను సోషల్ మీడియాలో లేను. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇండస్ట్రీలో సాధారణంగా జరుగుతున్న విషయాలపై మాత్రమే మాట్లాడాను అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అల్లు అర్జున్ 'పుష్ప 2' ప్రమోషన్ల సమయంలో ఆయన ప్రవర్తనపై సోషల్ మీడియాలో పలు చర్చలు జరిగాయి. 'తగ్గేదేలే' అనే పాత్ర యాటిట్యూడ్‌ను బయట కూడా చూపిస్తున్నారని, కొంతమంది అది అహంకారంగా కనిపిస్తోందని విమర్శించారు.ముంబైలో జరిగిన ప్రెస్ మీట్లలో ఆయన బాడీ లాంగ్వేజ్, సమాధానాల తీరు కూడా ట్రోలింగ్‌కు గురైంది. అలాగే ఆయనను కలవాలంటే కఠిన ప్రోటోకాల్ పాటించాలన్న వార్తలు కూడా వైరల్ అయ్యాయి.వివాదాల్ని పక్కనబెడితే, రవిబాబు ప్రస్తుతం రేజర్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది.అడవి నేపథ్యంలో జరిగే ఈ కథలో, మనుషుల కంటే జంతువులే ఎక్కువ వివేకంతో ప్రవర్తిస్తాయనే కాన్సెప్ట్‌ను చూపించనున్నారు. ముఖ్యంగా సినిమాలో కనిపించే కుక్క పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి వైదీ సంగీతం అందించగా, 'ఫ్లయింగ్ ఫ్రాగ్స్' బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్ కూడా హైలైట్‌గా ఉండనున్నాయి.



## సెయాన్' మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే డివైన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.

గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది. తారాగణం: శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే

## మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్.. కొరటాల శివ సినిమాలో పవర్‌ఫుల్ రోల్!




నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో 'ఎన్టీఆర్ బయోపిక్' (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హై-వోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య 'ఊరమాస్' అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.

## 'అమరం' మూవీ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్

తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్టర్న్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది.వెస్టర్న్ ఘాట్స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్న ప్రత్యేక యాక్షన్ బ్లాక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బాంబేకు చెందిన మార్షల్ ఆర్ట్స్ టీమ్ సహకారంతో మాస్టర్ మిరాకిల్ మైఖేల్ ఆధ్వర్యంలో మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించారు. లోతైన ప్రేమకథను సిట్యువేషనల్ యాక్షన్‌తో మేళవించి చిత్రాన్ని రూపొందించారు. తేజేష్ తొలి సినిమాకే అద్భుతమైన యాక్షన్ బ్లాక్స్‌లో నటించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొడైకెనాల్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం డాల్ఫిన్ నోస్ వద్ద తెరకెక్కించిన ఒక కీలక సన్నివేశాన్ని ఆయన సింగిల్ టేక్‌లో పూర్తి చేయడం విశేషం. హీరోయిన్‌గా ఐరా అగర్వాల్ నటించగా, నాగినీడు, సాయి ధీనా, జార్జ్ మరియన్, సురేష్ చంద్ర మీనన్, హరీష్ పరాడి తదితరులు కీలక పాత్రలు పోషించారు.ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన తిరువరుల్ కృష్ణన్ గతంలో నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ వద్ద అసోసియేట్‌గా పనిచేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, 'వడచెన్నై', 'అసురన్' చిత్రాలకు ఎడిటింగ్ చేసిన రామర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కొత్త సినిమాటోగ్రాఫర్ భరత్ విజువల్స్ అందించారు.ఈ చిత్రంలో ఐదు పాటలు ఉండగా, వాటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బూపతి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన రాజు సుందరం, ప్రభుదేవా మాస్టర్లకు సన్నిహిత సహాయ కుడిగా మంచి గుర్తింపు పొందారు. కొడైకెనాల్‌లో ఆర్ట్ డైరెక్టర్ జనా సర్ రూపొందించిన భారీ సెట్‌లో ఓ ప్రత్యేక ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాటలో కేరళకు చెందిన 60 మంది డ్యాన్సర్లు పాల్గొనడం విశేషం. మిక్కీ జే మేయర్ అందించిన ఈ ఫోక్ నెంబర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేర్వేరు సామాజిక వర్గాల నుంచి వచ్చిన ఓ జంట అనుకోని పరిస్థితుల్లో చేసే ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలతో సినిమా ఉత్కంఠభరితంగా సాగనుంది.



## 'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా.. ఆ సినిమాతో పోల్చొద్దు : లావణ్య త్రిపాఠి



తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ యాక్షణ్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com